

మెగాసిటీగా విశాఖ

ఇటు అనకాపల్లి నుంచి అటు విజయనగరం వరకూ విస్తరణ

- రాంబిల్లి నుంచి అనకాపల్లి, కొత్తవలస మీదుగా భోగాపురం వరకూ సెమీ రింగ్‌రోడ్డు నిర్మాణం ప్రతిపాదన
- అధ్యయనానికి కన్సల్టెంట్ నియామకం
- నివేదిక వచ్చిన వెంటనే డీపీఆర్ తయారీ
- ఐటీ, టూరిజం కారిడార్‌గా అభివృద్ధి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు చిన్న మత్స్యకార గ్రామమైన విశాఖపట్నం ఇప్పుడు మెగా సిటీగా మారబోతోంది. ఇంతింతై వటుడింతై...అనే చందంగా పంచాయతీలు, మునిసిపాలిటీలు, జిల్లాలను తనలో కలుపుకొంటూ వెలుతోంది.

కార్పొరేషన్‌గా ఉండే విశాఖపట్నం పక్కనున్న గాజువాక, భీమిలి, అనకాపల్లి మునిసిపాలిటీల విలీనంతో మహా విశాఖ నగర పాలక సంస్థగా మారింది. ఇప్పుడు అనకాపల్లి నుంచి విజయనగరం వరకూ విస్తరించి మెగా సిటీగా తయారు కానుంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అమరావతిలాగే తిరుపతి, విశాఖలను మెగా సిటీలు చేయాలనేది ప్రభుత్వం ఆలోచన. ఈ దిశగా ఇప్పటికే విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) కొన్ని నిర్ణయాలు తీసుకొంది. రాంబిల్లి నుంచి అనకాపల్లి, కొత్తవలస మీదుగా భోగాపురం వరకు సెమీ రింగ్ రోడ్డు నిర్మాణానికి డీపీఆర్ తయారుచేస్తోంది. కర్ణాటకకు చెందిన ఓ సంస్థకు అధ్యయనం చేసే పని అప్పగించింది. సుమారు 90 కి.మీ. పొడవున వచ్చే ఈ సెమీ రింగ్ రోడ్డు పూర్తిగా గ్రీన్ ఫీల్డ్ రహదారిగా నిర్మించాలనేది యోచన.

ఐటీ, పర్యాటకం కీలకం

అనకాపల్లి జిల్లా పారిశ్రామికంగా పరుగులు తీస్తోంది. ఆర్సెలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ హబ్, రాంబిల్లిలో నేవీ ప్రత్యామ్నాయ స్థావరం వంటివి కీలకంగా మారాయి. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్, భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతున్నాయి. వీటిన్నింటినీ కలుపుతూ విశాఖను మెగాసిటీ చేయాలనేది ఆలోచన. విశాఖపట్నం మీదుగా ఇప్పటికే జాతీయ రహదారి ఉంది. నగర ప్రజల కోసం మెట్రో రైలు ప్రాజెక్టుకు అడుగులు పడుతున్నాయి. నగరంలోకి భారీ వాహనాలు రాకుండా అనకాపల్లి నుంచి అలా వెళ్లిపోవడానికి ఆనందపురం వరకూ మరో జాతీయ రహదారిని నిర్మించారు. హైదరాబాద్‌లా విశాఖకు పూర్తిస్థాయి రింగ్ రోడ్డు నిర్మాణానికి కొండలు, సముద్రం అడ్డంకిగా ఉన్నందున అర్థ చంద్రాకారంలో సెమీ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇది ఎక్కడ కూడా జాతీయ రహదారిని తాకదు. రాంబిల్లిలో మొదలై అనకాపల్లి, కొత్తవలస మీదుగా భోగాపురాన్ని కలుస్తుంది. దీని పొడవు సుమారుగా 90 కి.మీ. ఉంటుందని అంచనా.

విశాఖపట్నంలో ఉపాధి అవకాశాలు భారీగా లభించే ఐటీ, పర్యాటక ప్రాజెక్టులు అనేకం వస్తున్నాయి. ఆనందపురం మండలంలో గూగుల్ డేటా సెంటర్, మధురవాడలో అదానీ, సిఫీ డేటా సెంటర్లు రానున్నాయి. భోగాపురం సమీపాన ఐటీ సిటీ వంటివి ... మిగతా 6వ పేజీలో

రక్తమోడుతున్న రోడ్లు

నగరంలో ఇటీవల పెరిగిన రోడ్డు ప్రమాదాలు

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిని ఫొటోలు తీయడం, పెండింగ్ చలాన్లు కట్టించడంపైనే పోలీసులు దృష్టి
- వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరణపై నిర్లక్ష్యం
- ఇష్టారాజ్యంగా వాహనాలను నడుపుతున్న చోదకులు
- అదే ప్రమాదాలకు కారణం


గాజువాకలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో రహదారులు రక్తమోడుతున్నాయి. రోజూ ఎక్కడో ఒకచోట ప్రమాదం జరుగుతోంది. ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొందరు గాయపడుతున్నారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు...ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిని ఫొటోలు తీయడం, పెండింగ్ చలాన్‌లను కట్టించడం లోనే నిమగ్నం కావడం వల్లే ఇటీవల కాలంలో ప్రమాదాల సంఖ్య పెరగడానికి కారణంగా చెబుతున్నారు.

వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాల్సిన ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఉల్లంఘించే వారిని సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీయడం, ఏదో ఒక కూడలి వద్ద నిలబడి వచ్చిపోయే వాహనాలను ఆపి పెండింగ్ ట్రాఫిక్ చలాన్లు ఉన్నాయేమోనని తనిఖీ చేయడం, ఉంటే వాటిని కట్టించడంపై మాత్రమే శ్రద్ధచూపుతున్నారు. సమీపంలో ట్రాఫిక్ జామ్ అయినా తమకేమీ సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తున్నారు. పోలీసులు ట్రాఫిక్ చలాన్‌లపై నిమగ్నమై ఉండడంతో వాహన చోదకులు కొందరు సిగ్నల్స్ వద్ద వేచివుండకుండా ముందుకు దూసుకువెళ్లిపోతున్నారు. ఇది ప్రమాదాలకు దారితీస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి మద్దిలపాలెం జంక్షన్ వద్ద రెడ్‌సిగ్నల్ పడిందని సత్యం జంక్షన్ వైపు నుంచి వస్తున్న ఒక ద్విచక్ర వాహన చోదకుడు తన వాహనాన్ని ఆపాడు. వెనుక నుంచి అపరిమిత వేగంతో వచ్చిన లారీ సిగ్నల్ వద్ద ఆపకుండా ఆగివున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి కొన్ని అడుగులు దూరం ఈడ్చుకువెళ్లింది. ఈ ప్రమాదంలో అల్లిపురానికి చెందిన జోగేశ్వరరావు అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. అలాగే శుక్రవారం సాయంత్రం

గత మూడేళ్లలో నమోదైన రోడ్డు ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు	క్షతగాత్రులు
2022	1353	358	1100
2023	1180	336	1080
2024	1106	317	980
2025	1045	274	564

(అక్టోబరు నాటికి)

అగనంపూడి జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న ఒక మహిళను ద్విచక్ర వాహనచోదకుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మహిళతోపాటు వాహనం నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. ఈనెల ఆరున ఆరిలోవ పైనాపిల్ కాలనీ వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు దాటుతున్న ఒకరిని అపరిమిత వేగంతో వచ్చిన వాహనం ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఈనెల ఆరో తేదీ అర్ధరాత్రి ఒక కారు ఇసుకతోట వైపు నుంచి వేగంగా వచ్చి మద్దిలపాలెం ఆటోమోటివ్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టడంతో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. నగరంలో ఇటీవల కాలంలో ఈ తరహా ప్రమాదాలు పెరుగుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

ఈ ఏడాదిలో 274 మంది మృతి

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గినప్పటికీ, ఇటీవల కాలంలో మళ్లీ పెరిగింది. 2022లో 1,353 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 358 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 1,100 మంది క్షతగాత్రులయ్యారు. 2023లో 1,180 ప్రమాదాలు జరగ్గా 336 మంది మృతిచెందారు. 1,080 మంది క్షతగాత్రులయ్యారు. 2024లో 1,106 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 317 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 980 మంది క్షతగాత్రులయ్యారు. ఈ ఏడాది అక్టోబరు నెలాఖరు నాటికి 1,045 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 274 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 564 మంది ... మిగతా 6వ పేజీలో

అంగన్‌వాడీ పోస్టులకు తీవ్ర పోటీ

- ఏడు కార్యకర్తల పోస్టులకు 64, 53 హెల్పర్ పోస్టులకు 197 దరఖాస్తులు
- స్థానిక ఎమ్మెల్యేల నుంచి సిఫార్సులు
- అధికారులకు నేరుగా ఫోన్ చేయిస్తున్న మరికొందరు అభ్యర్థులు
- ప్రస్తుతం వచ్చిన దరఖాస్తులను స్ర్కూటినీ చేస్తున్న అధికారులు

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్త, ఆయా పోస్టుల కోసం తీవ్ర పోటీ నెలకొంది. భీమునిపట్నం, విశాఖ అర్బన్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీల భర్తీ కోసం అధికారులు కొద్దిరోజుల కిందట నోటిఫికేషన్ విడుదల చేయగా భారీగా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారులు పలువురు స్థానిక ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. తమకు ఎలాగైనా పోస్టు వచ్చేలా చూడాలంటూ అభ్యర్థిస్తున్నారు. తమకు తెలిసిన స్థానిక నాయకుల ద్వారా సిఫారసు లేఖలు తీసుకుంటున్నారు. కొందరు ఎమ్మెల్యేలు ఆయా ... మిగతా 6వ పేజీలో

SCHOLARSHIP TEST
Date: 9th Nov. 2025 (Sunday)
COACHING FOR IIT-JEE & NEET
TEST CENTRES
ASCENT CLASSES
1. Beside K A Paul Auditorium, CBM Compound, Asilmetta, Visakhapatnam.
2. Opp. NSTL Family Gate, NAD Kotha Road, Visakhapatnam.
3. Opp. Cricket Stadium, Opp. MVV City 3rd Gate, P M Palem, Visakhapatnam.
Exam Timings: 10:00 a.m. to 12:15 p.m
DAV PUBLIC SCHOOL
STEEL PLANT
Sector-3, Ukkunagaram, Vizag.
Exam Timings: 10:00 a.m. to 12:15 p.m
SPRING DALES HIGH SCHOOL
NEW GAJUWAKA
Near Pantulugari meda, Gajuwaka, Vizag.
Exam Timings: 2:30 p.m. to 4:45 p.m
For Registration Contact Office
Asilmetta Campus
0891-2556015, 8897342167, 9704004847
NSTL Campus:
8977939346, 7989866197, 9948274565, 6303213908
P.M. Palem Campus:
8341064067, 8977792062
www.ascentclasses.edu.in
ascent CLASSES
Focusing on IIT-JEE & NEET
Registration Fee ₹100/- (1 PP Photo)
Those Studying CLASS 10th are eligible to apply

పెరిగిన కూరగాయల ధరలు

ప్రియంగా మారిన ఆకుకూరలు, బీన్స్ రకాలు

- వర్షాలతో పంటలు దెబ్బతినడం, కార్తీకమాసంలో వినియోగం పెరగడం కారణం
- బీరకాయలు, కాకరకాయలు కిలో రూ.50
- వంకాయలు రూ.50-70



విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): **నగరంలోని రైతుబజార్లలో కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో వరుసగా నాలుగు రోజులు భారీ వర్షాలు కురవడంతో రాష్ట్రంలో చాలా చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. వాటి ప్రభావం బజార్లలో కనిపిస్తోంది.**

ఆకుకూరలన్నీ ప్రియమైపోయాయి. వర్షాలకు ముందు పది రూపాయలకు రెండు తోటకూర కట్టలు లభించేవి. ఇప్పుడు ఒక కట్ట ఇరవై రూపాయలకు అమ్ముతున్నారు. పాలకూర అయితే దొరకడమే కష్టంగా ఉంది. మెంతి కూర రూ.30 పెడితే నాలుగు చిన్నకట్టలు ఇస్తున్నారు. మార్కెట్‌లో టమాటా రేటు కిలో రూ.30కి అటుఇటుగా నడుస్తోంది. లారీల్లో ఎక్కువ సరకు వస్తే రూ.24 నుంచి రూ.26కు, రాకపోతే కిలో రూ.30 చొప్పున అమ్ముతున్నారు. బంగాళాదుంపలు, ఉల్లిపాయలు కిలో రూ.19 నుంచి రూ.20కి లభిస్తున్నాయి. ఈ మూడింటి ధరలే ధరలే ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.


వంకాయల ధర అధికంగా ఉంది. తెలుపు రకం కిలో రూ.50, నలుపైతే రూ.70 చొప్పున అమ్ముతున్నారు. బెండకాయలు కిలో రూ.30కి లభించేవి. ఇప్పుడు రూ.50 పలుకుతున్నాయి. దొండకాయలు కూడా కిలో రూ.40 నుంచి రూ.50 మధ్య అమ్ముడవుతున్నాయి. బీరకాయలు, కాకరకాయలు కిలో రూ.40లోపే ఉండేవి. ఇప్పుడు కిలో రూ.50కు అమ్ముతున్నారు. క్యారెట్ రేటు రూ.40 నుంచి రూ.60కి పెరిగింది. బీన్స్ రకాలు కిలో రూ.40కే ఇచ్చేవారు. ఇప్పుడు అవి డబుల్ రేటు పలుకుతున్నాయి. కిలో రూ.70 నుంచి రూ.80కి విక్రయిస్తున్నారు. ఆనపకాయ ... మిగతా 6వ పేజీలో

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో
ప్రదర్శన మరియు అమ్మకం
వెడ్డింగ్ సీజన్ స్పెషల్
చివరి 3 రోజులు
హోటల్ గ్రీన్ పార్కు
వాల్తేరు మెయిన్ రోడ్డు, విశాఖపట్నం
భారతదేశం నలుమూలల గల 150+ సర్టిఫైడ్ వీవర్స్ & బెస్ట్ డిజైనర్స్ నుండి
భారత దేశం నలుమూలలా ప్రామాణికమైన & నమ్మకమైన సిల్క్ & కాటన్ చీరలు వీవర్స్ ధరకు మాత్రమే
అన్ని లేటెస్ట్ వెరైటీలు & కొత్త డిజైన్‌లు

UP TO 50% DISCOUNT
M: 9441987009 | Entry Free | All UPI Online / Debit & Credit Cards Accepted

క్యాన్సర్‌ను జయించి...

- 58 ఏళ్ల వయసులో ఎవరెస్ట్ బేస్ క్యాంపు అధిరోహణ
- సత్తా చాటిన నగర మహిళ


మున్నీ కైజరే

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన మున్నీ కైజరే అరుదైన ఘనతను సాధించారు. రొమ్ము క్యాన్సర్ బారినపడి కోలుకున్న ఆమె 58 ఏళ్ల వయసులో 18 వేల అడుగుల ఎత్తులో ఉండే ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించారు. ఎండాడ ప్రాంతానికి చెందిన మున్నీ టింపనీ స్కూల్‌లో టీచర్‌గా పనిచేశారు. ఆమె 2017లో రొమ్ము క్యాన్సర్ బారినపడ్డారు. సుమారు ఏడాదిన్నర పాటు క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించారు. ఆ తరువాత ఆరేళ్లకు ... మిగతా 6వ పేజీలో

సబ్ ట్రెజరీ కుంభకోణంలో అధికారులపై చర్యకు మీనమేషాలు!

- ఉన్నతస్థాయి ఒత్తిళ్లే కారణం?
- సీనియర్ అకౌంటెంట్లకు మాత్రమే చార్జిమెమోలు
- ఉప, సహాయ ఖజానా అధికారుల పాత్రపై మౌనం
- విజిలెన్స్ నివేదిక బహిర్గతం చేయాలంటున్న ఉద్యోగులు



విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార సబ్ ట్రెజరీలో పింఛన్‌దారుల సొమ్ము స్వాహా వ్యవహారంలో అధికారులపై చర్యకు ఉన్నతాధికారులు వెనుకంజ వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కుంభకోణానికి సంబంధించి 11 మంది సీనియర్ అకౌంటెంట్లకు జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ చార్జిమెమోలు ఇచ్చిన సంగతి విదితమే. ఇందులో పలు కేడర్‌లకు చెందిన సుమారు 20 మంది అధికారుల పాత్ర కూడా ఉందంటున్నారు.

సీతమ్మధార సబ్‌ట్రెజరీలో 2011 నుంచి 2017 వరకు పింఛన్‌దారులకు సంబంధించి రూ.ఆరు కోట్ల వరకు స్వాహా జరిగిందని విజిలెన్స్ విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో మొత్తం ... మిగతా 6వ పేజీలో

కేజీహెచ్‌లో విద్యుత్ సమస్యపై విచారణకు కమిటీ

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయంపై విచారణకు కమిటీని నియమించారు. ఆస్పత్రిలో గురువారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో ఆస్పత్రి అధికారుల తీరుపై పెద్దఎత్తున విమర్శలు వచ్చిన నేపథ్యంలో అసలు ఏం జరిగిందన్న విషయాన్ని తెలుసుకునేందుకు సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి కమిటీని ఏర్పాటుచేశారు. ఆమె నేతృత్వంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ ఎన్‌వీ రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖరంనాయుడు, అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన వైద్యుడు డాక్టర్ కిరణ్ విచారణ చేపడతారు. మార్చురీ వద్ద పనులు చేపట్టిన అధికారులు, సిబ్బందితో మాట్లాడి వివరాలను సేకరించనున్నారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు, డీఎంఈకి అందించనున్నారు.

NAREDCO
VIZAG PROPERTY Fest 2025
Under the aegis of the Ministry of Housing and Urban Affairs, Government of India
ENTRY FREE
SPECIAL DISCOUNTS
VISIT NAREDCO PROPERTY FEST
YOUR ONE-STOP DESTINATION FOR DREAM LIVING!
GADIRAJU PALACE,
BEACH ROAD, VISAKHAPATNAM
HOURLY LUCKY DRAW
BUMPER PRIZE
NOV. 14 15 16 2025
MEDIA PARTNER ఈనాడు etv
APARTMENTS | PLOTS | VILLAS | FARMLANDS | BANKS
INTERIORS | BUILDING MATERIALS
SPONSORED BY
THE VALLEY
SBI HOME LOANS
Jaquar BATH + LIGHT
SCAN ME



స్వామివారికి గరుడ సేవ చేస్తున్న అర్చకులు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనారసింహునికి పలు ఆర్జిత సేవలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు జరిపి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్ర నామాలు పఠిస్తూ తులసీ దళార్చన చేశారు. గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి సేవ చేశారు. తరువాత అదే వేదికపై నిత్య కల్యాణం నిర్వహించారు. సామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సీసీ కెమెరాల నిర్వహణ పట్ల అలసత్వం



సీసీ కెమెరాలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు

సింహాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై పలు కూడళ్లలో భక్తుల రక్షణ, శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణ పట్ల దేవస్థానం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రధాన మాడవీధిలో పీఆర్‌ఓ కార్యాలయానికి ఎదురుగా పూర్వపు పీఆర్‌ఓ కార్యాలయానికి చేరువగా ఏర్పాటు చేసిన కెమెరాల చుట్టూ చెట్ల కొమ్మలు ఉన్నాయి. దీనివల్ల ఆ చుట్టుపక్కల ఏదైనా చోరీ జరిగినా రికార్డు అయ్యే అవకాశం లేదు. ఇదే పరిస్థితి చాలాచోట్ల నెలకొంది. అధికారులు స్పందించి కెమెరాల చుట్టూ ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

డివైడర్ల మధ్య మొక్కలు కరువు



మొక్కలు లేకుండా ఖాళీగా ఉన్న డివైడర్

మధురవాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మిథిలాపురి వుడాకాలనీ రోడ్డు నుంచి ఐటీ కంపెనీలకు వెళ్లే రహదారి మధ్య ఉన్న డివైడర్ పచ్చదనం లేక వెలవెలపోతోంది. గతంలో వుడా రోడ్డు నుంచి ఐటీ హిల్ వరకు నాలుగు కిలోమీటర్ల మేర రహదారి మధ్యలో డివైడర్‌పై మొక్కలు నాటేందుకు కొంత స్థలం ఉంచారు. జీవీఎంసీ, ఉద్యానవన శాఖాధికారులు సంయుక్తంగా డివైడర్ మధ్యలో మొక్కలు వేశారు. మొదట్లో బాగానే ఉన్నా.. తరువాత నిర్వహణ లోపం వల్ల కొన్ని మొక్కలు ఎండిపోగా, మరికొన్ని రక్షణ లేక పశువులు తినడంతో పాడయ్యాయి. నాటి నుంచి డివైడర్‌పై పచ్చదనం కరువైంది. అధికారులు స్పందించి డివైడర్ మధ్యలో మొక్కలు వేసి, సంరక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు లక్ష్మీపురం విద్యార్థులు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు పాఠశాలల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీల్లో లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ చిల్ల వెంకటరెడ్డి తెలిపారు. అండర్ 17 విభాగంలో కె. శ్రావ్య, ఎల్. మహేశ్ ఫుట్‌బాల్‌లోనూ, బి. పవన్, సురేంద్ర రగ్బీలోనూ ఎంపికయ్యారని చెప్పారు.శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం డి. సత్యారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు మహా చండీయాగం



భీమునిపట్నం (రూరల్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడమిట్టపాలెం భువనేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం మహా చండీయాగం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు డి.రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు యాగం జరుగుతుందని, అనంతరం అన్నసమారాధన ఉంటుందని చెప్పారు. యాగానికి వచ్చేవారు తెలుపు రంగు దుస్తులు ధరించాలని, అవసరమైన పూజా సామగ్రి తామే అందజేస్తామన్నారు.

అవంతిలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న అధికారులు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చిప్పాడ రోడ్డులో ఉన్న అవంతి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్సు డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. మొదటి సంవత్సరం విద్యార్థులను ఆహ్వానిస్తూ.. సీనియర్ విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏయూ డీన్ టి.వి. కృష్ణ, భోగాపురం సీఐ దుర్గా ప్రసాద్, భీమిలి ఎస్‌ఐ భరత్‌కుమార్‌రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిసలు కాకూడదని చెప్పారు.

14 నుంచి పవిత్రోత్సవాలు

సాగర్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 14 నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సాయంత్రం అంకురార్పణతో పూజలు ప్రారంభమవుతాయి. 15 నుంచి 17 వరకు ఉదయం, సాయంత్రం యాగ శాలలో హోమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. అలాగే మూడు రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.



ఆలయంలోని క్యూలైన్లలో భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న ప్రధాన రాజగోపురం పరిసరాలు

భక్తులతో సింహగిరి కిటకిట

సింహాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు. కార్తీక మాసం రెండో శనివారం కావడంతో పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఒడిశా నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సింహగిరి కిటకిటలాడింది. సూర్యోదయానికి ముందే భక్తులు పుష్కరిణిలో, సింహగిరి మెట్ల మార్గంలోని జలధారల్లో పుణ్యస్నానాలు ఆచరించి, దీపారాధనలు చేశారు. తొలుత భైరవస్వామిని, కొండదిగువ స్వామివారి పూతోటలోని వేంకటేశ్వరస్వామిని, అప్పన్న సహోదరి అడివివరం గ్రామ దేవత పైడితల్లమ్మను దర్శించుకున్నారు. అనంతరం సింహాద్రినాథుడ్ని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల తాకిడితో అప్పన్న ఖజానాకు శనివారం ఒక్కరోజే రూ.44.56 లక్షల ఆదాయం సమకూరింది.

కాగా దర్శనానికి చాలామంది భక్తులు సిఫార్సులతో వస్తున్నారు.ముఖ్యంగా ప్రతి శని, ఆదివారాలతో పాటు ఏకాదశి, ఇతర ప్రత్యే



కార్లతో నిండిన సింహగిరి పార్కింగ్

కమైన రోజుల్లో ఈపరిస్థితి ఎక్కువగా ఉంటుంది. స్వామివారి దర్శనం సులభంగా తక్కువ సమయంలో చేసుకునేందుకు ప్రజాప్రతినిధుల నుంచి పలువురు సిఫార్సు లేఖలు తీసుకువస్తున్నారు. సింహగిరిపై ఉన్న పీఆర్‌ఓ కార్యాలయం వద్ద ప్రొటోకాల్ టికెట్స్ కోసం రద్దీ రోజుల్లో భక్తులు బారులు తీరి కనిపిస్తున్నారు. సందడిలో సడేమియా అన్నట్టు కొందరు సిబ్బంది దొరికిందే అవకాశంగా స్వప్రయోజనాలకు వాడుకుని అందినకాడికి దోచుకుంటున్నారు. కొన్ని శాఖల సిబ్బంది తమ అధికారుల పేరుతో ప్రొటోకాల్ టికెట్లు తీసుకుని ఉన్న ప్రివిలైజ్‌ను దుర్వినియోగం చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహనాల పార్కింగ్‌కు అవస్థలు

వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు

సింహగిరికి వస్తున్న భక్తులు వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో శనివారం తప్ప ఇతర రోజుల్లో పెద్దగా రద్దీ ఉండేది కాదు. మూడేళ్లుగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో సింహగిరిపై, కొండదిగువ వాహనాల పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పీఆర్‌ఓ కార్యాలయం ఎదురుగా, గజపతి సత్రం పరిసరాల్లో కార్లు, స్కూటర్లు పార్కింగ్ చేస్తున్నప్పటికీ కొన్ని వాహనాలకు స్థలం ఉండడం లేదు. అలాగే కొండదిగువన భక్తులను తీసుకువచ్చే ఆటోలు, ట్యాక్సీలు పార్కింగ్ ప్రాంతం లేక బస్సులు తిరిగే దేవస్థానం బస్టాండ్‌లో పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల ఆర్టీసీ, దేవస్థానం బస్సులు రాకపోకలకు అవస్థలు పడాల్సి వస్తోంది.

భీమిలిలో ఉత్సాహంగా యోగా పోటీలు

భీమునిపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ది సన్ స్కూల్ ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి యోగా పోటీలను శనివారం నిర్వహించారు. 14, 17 ఏళ్ల లోపు విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీలను ఎంఈఓ మామిళ్లపల్లి శివరాణి ప్రారంభించారు. 120 మంది విద్యార్థులు హాజరుకాగా అండర్ 14, 17 విభాగాల నుంచి 24 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని ఎస్‌జీఎఫ్ సభ్యులు టి. నాగేశ్వరరావు, సీహెచ్ వెంకటరావు తెలిపారు. ఎంపికైన వారు ఈనెల 23, 24వ తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ది సన్ స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు.



మాట్లాడుతున్న ది సన్ స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు

సంగివలసలో స్వరార్చన

తగరపువలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంగివలస వద్ద ఉన్న పీఠంలో అయ్యప్పస్వాములు శనివారం స్వరార్చన కార్యక్రమం నిర్వహించారు. గురుస్వామి చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో సుమారు 42 పాటలను ఆలపించారు. అనంతరం నారాయణసేవ నిర్వహించారు.

14న పెన్షనర్ల సమావేశం

భీమునిపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం భీమిలి తాలూకా యూనిట్ సర్వసభ్య సమావేశం ఈనెల 14న జరగనున్నట్టు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి. భీమారావు, ఎం. ఆనందరావు తెలిపారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. బీచ్ రోడ్‌లో వున్న సరస్వతీ సమాజంలో జరిగే ఈ సమావేశానికి భీమిలి అర్బన్, రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాల నుంచి సభ్యులంతా విధిగా హాజరుకావాలని కోరారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని చెప్పారు.

యూనిఫారాలు పంపిణీ

తగరపువలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీకృష్ణా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి, 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కళాశాల చైర్మన్ బి.నరసింగరావు 70 మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున యూనిఫారాలను శనివారం పంపిణీ చేశారు. అలాగే పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టివలస విద్యార్థికి రెజ్లింగ్‌లో కాంస్య పతకం

తగరపువలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బి. ఆదిలక్ష్మి రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో కాంస్య పతకం పొందింది. ఈనెల 4, 5, 6వ తేదీల్లో ఎన్‌టీఆర్ జిల్లా నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఆదిలక్ష్మి 43 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించింది. బాలికను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ అచ్చుతరావు, హెచ్‌ఎం డి. ఆదినారాయణ, విద్యా కమిటీ చైర్మన్ చిట్టిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రమాదకరంగా కాంక్రీట్ దిమ్మలు



తీరంలో ఉన్న కాంక్రీట్ దిమ్మలు

సాగర్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ వల్ల రుషికొండ బీచ్‌లో అలల తాకిడికి ఇసుకలో కూరుకుపోయిన కాంక్రీట్ దిమ్మలు శనివారం బయటపడ్డాయి. తుఫాన్ సమయంలో అలలు ముందుకు రావడంతో బీచ్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు నేలకొరిగి, స్తంభాలకు ఉన్న కాంక్రీట్ దిమ్మలు ఇసుకలో కూరుకుపోయాయి. తొలుత వీటిని బంకర్ అని పలువురు భావించారు. క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత కాంక్రీట్ దిమ్మగా తెలిసింది. ఇటువంటి దిమ్మలు ఇసుకలో చాలావరకు కూరుకుపోయాయి. బీచ్‌లో స్నానాలు చేసే సమయంలో వీటి వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, తక్షణమే తొలగించాలని సందర్శకులు కోరుతున్నారు.

పేరుకుపోయిన తుప్పలు



రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పలు

పద్మనాభం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోరాడ నుంచి లింగన్నపేట, అయినాడ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా తుప్పలు పేరుకుపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మలుపుల వద్ద మార్గం పూర్తిగా కనిపించడం లేదు. తుప్పలు, చెట్ల కొమ్మలు రోడ్డు మీదకు రావడంతో ద్విచక్ర వాహనదారుల కళ్లకు తగిలి ప్రమాదాలకు గురవుతున్నారు.

రక్తమోడుతున్న రోడ్లు

... 5వ పేజీ తరువాయి

క్షతగాత్రులయ్యారు. గత వారం రోజుల్లోనే రోడ్డు ప్రమాదాల కారణంగా సుమారు 15 మంది వరకు మృత్యువాతపడ్డారు. గత మూడేళ్లుగా రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుతూ వచ్చినప్పటికీ ఈ ఏడాది ప్రమాదాల సంఖ్యతోపాటు మరణాల సంఖ్య కూడా పెరిగేలా ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

సీపీ దృష్టిసారించకపోతే మరింత పెరిగే అవకాశం

పెండింగ్ చలాన్ల వసూళ్లపై కాకుండా వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టిపెట్టాల్సిందిగా సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీచేయాల్సిన అవసరం ఉంది. అలాగే కొందరు సిబ్బంది విధి నిర్వహణను పక్కనపెట్టి చెట్ల కింద కుర్చీలో కూర్చొని సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై కనిపించకపోవడంతో ఇష్టారాజ్యంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అదే ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై ఉంటే వాహన చోదకులు నిబంధనలను పాటిస్తారు కాబట్టి ప్రమాదాలకు ఆస్కారం తగ్గుతుంది. రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడంపై సీపీ దృష్టిసారించాలని నగరవాసులు కోరుతున్నారు.

క్యాన్సర్‌ను జయించి...

... 5వ పేజీ తరువాయి

కొందరు స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్లారు. దానిని కొనసాగిస్తూ వచ్చారు. ఈ క్రమంలో పూణెకు చెందిన గిరి ప్రేమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరో ఐదుగురు మహిళలతో కలిసి గత నెల మూడో తేదీన ఎవరెస్ట్ పర్వతారోహణకు వెళ్లారు. 12వ తేదీ నాటికి బేస్ క్యాంపునకు చేరుకుని తిరిగి 17వ తేదీ నాటికి వెనక్కి వచ్చారు. మహిళలు చిన్నచిన్న సమస్యలకు కుంగిపోకుండా ధైర్యంగా ఉండాలని, ఆత్మస్థైర్యంతో ముందుకుసాగితే విజయాలను సాధించగలమని మున్నీ పేర్కొన్నారు.

పాండ్రంగిలో 179 మందికి వైద్య పరీక్షలు

పద్మనాభం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాండ్రంగి పంచాయతీ కుర్రపల్లి గ్రామంలో భీమిలి ఎస్‌ఓఎస్ కుటుంబ బలోపేతం కార్యక్రమంలో భాగంగా శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.మెడికవర్ వైద్యులు 179 మందికి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హర్ష, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్, ఎస్‌ఓఎస్ ప్రతినిధులు కె. దుర్గరాజు, అనన్యదాస్, చందక జానకి, బత్తిన భారతి, పాల్గొన్నారు. అలాగే బీఆర్ తాళ్లవలసలో భగవాన్ సత్యసాయిబాబా శత వార్షిక జయంత్యుత్సవాల్లో భాగంగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు 60 మందికి పరీక్షలు చేసి, 37 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. విశాఖపట్నం సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని సర్పంచ్ సీహెచ్ శ్రీను, టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటరు సాయికుమార్, గొల్లలపాలెం భజన మండలి కన్వీనరు డి. అప్పలరాజు, తోలేటి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆరో వార్డులో 'కోటి సంతకాల సేకరణ'

కొమ్మాది, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ఇవ్వాలన్న ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ నాయకులు ఆరో వార్డులోని పీఎంపాలెం బి 2 కాలనీలో శనివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. వార్డు పార్టీ అధ్యక్షుడు పోతిన ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్లాజీ, రమణబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

మద్దిలో అయ్యప్పస్వామి అంబలం పూజ

పద్మనాభం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మద్దిలో అయ్యప్పస్వామి అంబలం పూజ శనివారం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి సామవేదం బదరికా వాసు ఆధ్వర్యంలో గణేశుడు, సుబ్రహ్మణ్యస్వామి, లక్ష్మీదేవి, పార్వతీ పరమేశ్వరులు, అయ్యప్పస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాలలు వేసిన వారికి నారాయణసేవ జరిపారు.



కొండపైకి దర్శనాలకు వెళుతున్న భక్తులు

సౌమ్యగిరికి పోటెత్తిన భక్తులు

భీమునిపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు శనివారం పోటెత్తారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన వారు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున అయిదు నుంచి కొండ దిగువన స్వామివారి పాదాల వద్ద పూజలు చేసి, మెట్ల మార్గంలో దర్శనానికి వెళ్లారు. మధ్యాహ్నం వరకూ రద్దీ కొనసాగింది. సాయంత్రం మెట్ల మార్గంలో దీపారాధన చేశారు. కాగా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

ఎన్‌వీ రత్నం మృతి పట్ల నివాళి

కొమ్మాది, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎన్‌వీ రత్నం మృతి క్రీడా రంగానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. పీఎంపాలెంకు చెందిన రత్నం శనివారం అనారోగ్యంతో మృతి చెందారు.ఈమేరకు రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్, జనసేన నాయకుడు చంద్రరావు, వైసీపీ నాయకుడు గాదె రోసిరెడ్డి, తదితరులు ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రీడా రంగానికి రత్నం చేసిన కృషిని కొనియాడారు. ఆయన మృతి పట్ల ఆల్ ఇండియా బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్, స్టేట్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, విశాఖ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

సబ్ ట్రెజరీ కుంభకోణంలో అధికారులపై చర్యకు మీనమేషాలు!

... 5వ పేజీ తరువాయి

36 మంది పాత్ర ఉన్నట్టు నిర్ధారించింది. అందులో ఇప్పటివరకూ నలుగురు చనిపోగా, 32 మంది ఉన్నారు. వారిలో కొందరు రిటైరయ్యారు. ఇంకా సర్వీస్‌లో 11 మంది సీనియర్ అకౌంటెంట్లు, మరికొందరు ఉప, సహాయ ఖజానా అధికారులు ఉన్నారు. సీనియర్ అకౌంటెంట్లకు జిల్లా స్థాయిలో డిప్యూటీ డైరెక్టర్ హోదా కలిగిన జిల్లా ఖజానా అధికారి మోహనరావు చార్జిమెమోలు ఇచ్చారు. అధికారులు మాత్రం విజయవాడలోని ఖజానా శాఖ డైరెక్టరేట్ పరిధిలోకి వస్తారు. అధికారులకు చార్జిమెమోలు జారీ చేయకుండా ఒత్తిళ్లు వస్తున్నాయని చెబుతున్నారు. కుంభకోణం వెలుగులోకి వచ్చిన తరువాత ఒకపక్క విచారణ జరుగుతుండగానే కొందరు సీనియర్ అకౌంటెంట్లకు ఉప ఖజానా అధికారులుగా, ఉపఖజానా అధికారులకు సహాయ ఖజానా అధికారులుగా పదోన్నతులు కల్పించారు. నిబంధనల ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వకూడదు. కానీ సొమ్ములు తీసుకుని పదోన్నతులు ఇచ్చినట్టు చెబుతున్నారు. దోషులుగా విజిలెన్స్ గుర్తించిన అధికారులపై ఉన్నతస్థాయిలో ఒత్తిళ్ల కారణంగా ఇప్పుడు చర్యలకు వెనకడుగు వేస్తున్నారనే చర్చ ఖజానా శాఖలో జరుగుతోంది. ఏపీ ఉద్యోగుల సర్వీస్ రూల్స్ ప్రకారం ఒక ఉద్యోగి/అధికారి పదవీ విరమణ చేసి నాలుగుళ్లు దాటితే...అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకూడదు. సబ్‌ట్రెజరీ కుంభకోణంలో పాత్రధారులుగా తేలిన వారిలో పదవీ విరమణ చేసి నాలుగేళ్లు పూర్తికాని వారున్నారు. అందుకు కొద్దినెలలు మాత్రమే సమయం ఉన్నవారున్నారు. అటువంటి వారంతా చార్జిమెమోలు ఇవ్వకుండా చూసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. నాలుగేళ్లు పూర్తయిన తరువాత మెమోలు ఇచ్చినా సర్వీస్ రూల్స్ మేరకు చెల్లవని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక బహిర్గతం చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు. నివేదికలో పేర్కొన్న ప్రతి ఉద్యోగి/అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పెరిగిన కూరగాయల ధరలు

... 5వ పేజీ తరువాయి

చిన్నదైతే రూ.20, పెద్దదైతే రూ.30కి దొరికేది. ఇప్పుడు వాటిని రూ.40 కంటే తక్కువకు ఇవ్వడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో బీర, బెండ, దొండ, ఆనప పండిస్తున్నారు. వీటిని రైతులు పది రూపాయలు అటుఇటుగా అమ్మేసి త్వరగా ఇంటికి వెళ్లిపోతున్నారు. ఇతర జిల్లాల నుంచి హోల్‌సేల్ వ్యాపారులు తెప్పిస్తున్న బీన్స్ రకాలు, క్యారెట్, బీట్‌రూట్ తదితరాల ధరలు అధికంగానే ఉన్నాయి. ఇది కార్తీకమాసం, అయ్యప్ప స్వాముల దీక్షలు ప్రారంభం కావడంతో అత్యధికులు శాకాహారమే తీసుకుంటున్నారు. దాంతో కూరగాయల వినియోగం బాగా పెరిగింది. రేటు ఎక్కువ పెట్టినా తప్పనిసరిగా కొంటారనే ధీమా ఉండడంతో హోల్‌సేల్ వ్యాపారులు డిమాండ్‌కు సరిపడా సరకులు తెప్పించకుండా కొంచెం తక్కువ రప్పిస్తూ కృత్రిమ డిమాండ్ సృష్టించి అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. దీనిపై వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు దృష్టి పెడితే సరకుల లభ్యత పెరిగి ధరలు తగ్గుతాయి.

అంగన్‌వాడీ పోస్టులకు తీవ్ర పోటీ

... 5వ పేజీ తరువాయి

పోస్టులను మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేస్తారని, సిఫారసులను పరిగణనలోకి తీసుకోరని చెబుతున్నా అభ్యర్థులు వినిపించుకోవడం లేదు. 'మీరు లెటర్ ఇస్తే చాలు సర్. మిగిలిన పని మేము చూసుకుంటాం' అంటున్నారు. దీంతో పలువురు ఎమ్మెల్యేలు తప్పనిసరి పరిస్థితుల్లో లేఖలు ఇస్తున్నారు. ఇప్పటివరకూ సిఫారసు లేఖలతో 20 మంది వరకూ ఐసీడీఎస్ కార్యాలయానికి వచ్చినట్టు చెబుతున్నారు. మరికొందరు కార్యాలయ అధికారులకు స్థానిక ప్రజా ప్రతినిధులతో ఫోన్లు చేయిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మన వాళ్లకు వచ్చేలా చూడండని కొందరు నేతలు చెబుతున్నట్టు తెలుస్తోంది.

భారీగా దరఖాస్తులు..

భీమునిపట్నం ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఐదు కార్యకర్తల పోస్టులకు 32 మంది దరఖాస్తు చేశారు. అలాగే, విశాఖ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న రెండు కార్యకర్తల పోస్టులకు మరో 32 మంది అభ్యర్థులు దరఖాస్తులు వచ్చాయి. భీమునిపట్నం ప్రాజెక్టు పరిధిలో 11, పెందుర్తి ప్రాజెక్టు పరిధిలో 21, విశాఖ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో 21 హెల్పర్ పోస్టులకు 193 మంది దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను ప్రస్తుతం అధికారులు స్క్రూట్నీ చేస్తున్నారు. అయితే, దరఖాస్తు చేసిన వారిలో దాదాపు ప్రతి ఒక్కరూ రాజకీయంగా పలుకబడిని ఉపయోగిస్తుండడంతో అధికారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయిన తరువాత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించి నియామక పత్రాలు అందిస్తామని చెబుతున్నారు.

మెగా సిటీగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

ప్లాన్ చేస్తున్నారు. అదేవిధంగా విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్‌లో పర్యాటక ప్రాజెక్టులు అనేకం వస్తున్నాయి. విశాఖ నుంచి ఆనందపురం మీదుగా అనేక పేరొందిన విద్యా సంస్థలు ఐఐఎం, అనిట్స్, గాయత్రి, అవంతి, రఘు ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ఇవన్నీ ఈ మెగాసిటీకి గ్రోత్ ఇంజన్లుగా ఉపకరిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

డీపీఆర్ తయారుచేస్తాం

ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

రాంబిల్లి నుంచి భోగాపురం వరకు సెమీ రింగ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన అధ్యయనం కోసం కన్సల్టెంట్‌ను నియమించాం. ఆ మార్గం ఎలా ఉండాలి?, ఎటువైపు తీసుకువెళ్లాలి?...అనే అంశాలపై నివేదిక వస్తుంది. దాని ప్రకారం డీపీఆర్ తయారుచేస్తాం. ఇది త్వరగానే కార్యరూపంలోకి వస్తుంది.

25 ఏళ్లలో శ్రీకాకుళం కూడా కలుస్తుంది

పీవీఎన్ మాధవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వం అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం ఒక స్ట్రిప్ కింద అభివృద్ధి చేయాలని భావిస్తోంది. అందులో భాగంగానే సెమీ రింగ్ రోడ్డు ప్రతిపాదించారు. ఇది ఎంతవరకు ఉపయోగపడుతుందనే దానిపై చర్చలు జరుగుతున్నాయి. రాబోయే 25 ఏళ్లలో శ్రీకాకుళం కూడా వీటితో కలిసిపోనుంది.

పశు సంచారంతో అధ్వానంగా అబ్దుల్ కలాం పార్కు

- గోవుల పేడ, మూత్రాలతో నిండిపోతున్న ఉద్యానవనం
- ఆటపాటలకు అవకాశం లేకుండా పోవడంతో యువత ఇబ్బందులు
- అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికుల అసంతృప్తి



పార్కు నిండా నిండిన ఆవు పేడమూత్రాలు



పార్కులో యథేచ్ఛగా సంచరిస్తున్న పశువులు

వెంకోజీపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ అబ్దుల్‌కలాం పార్కు నిర్వహణ అధ్వానంగా తయారైంది. పార్కును అభివృద్ధి చేయరు.. కనీసం పార్కులోకి పశువుల సంచారాన్ని అరికట్టరు.. దీంతోపార్కుకు వచ్చే ఆటగాళ్లు, వ్యాయామం చేసేవారు గోమూత్ర, విసర్జాలను ఎత్తుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

2014 ముందు ఈ పార్కు డెబ్రీస్‌తో నిండిపోయి డంపింగ్ యార్డును తలపించేది. ఆ తరువాత టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చొరవతో ఈ పార్కులో అభివృద్ధి పనులు చేపట్టారు. వాకింగ్ ట్రాక్, బోరు బావిని ఏర్పాటు చేశారు. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో పాటు వార్డు కార్పొరేటర్ ఎన్నికలు కూడా జరగడం, అదీ కూడా వైసీపీ కార్పొరేటరే ఎన్నికవడం జరిగింది. కానీ ఇక్కడొక పార్కు ఉందని గానీ, దీనిని అభివృద్ధి చేయాలని గానీ ఎటువంటి ఆలోచనలు కార్పొరేటర్ చేయలేదు. కాగా పార్కులో సచివాలయం నిర్మాణం చేసేందుకు ప్రయత్నం కూడా చేసి అప్పటి మేయర్ గొలగాని హరి వెంకటకుమారితో శంకుస్థాపన కూడా చేయించారు. దీనిపై వ్యతిరేకత రావడంతో జీవీఎంసీ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొంది అలాగే పార్కు అభివృద్ధి చేయండంటూ వినతులు అందడంతో మొక్కుబడిగా మూడు రకాల వ్యాయామ సామగ్రిని కూడా అధికారులు ఏర్పాటు చేశారు.

ఇటీవల కురిసిన వర్షాలు, గాలికి భారీ వృక్షం నేల కొరగడంతో పార్కుకు ఒక పక్క గోడ కూలిపోయింది. మరో పక్క చిన్న గేటు విరిగిపోవడంతో అక్కడ పశువులు, కుక్కలు వంటివి ప్రవేశానికి అవకాశం ఏర్పడింది. దీంతో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు షటిల్ ఆటగాళ్లు, కరాటే శిక్షకులు ఈ పార్కులో ఉంటారు. ఆ తరువాత సెలవు రోజులో అయితే కొందరు యువకులు క్రికెట్ ఆడతారు. మిగిలిన రోజుల్లో, మిగిలిన సమయంలో మందు బాబులు, గోవులకు ఈ పార్కు అడ్డాగా మారిపోయింది. ఒక పక్క వాకింగ్ ట్రాక్‌పైన, ఆ పక్కన మందుబాబు అధ్వానం చేస్తుంటే.. మరో పక్క పార్కు మధ్యలో షెటిల్ కోర్టులు, కరాటే శిక్షణ ప్రాంతంలోనూ గోవులు పేడ తీరడమే కాకుండా మలమూత్రాలు విసర్జిస్తుండడం ఇబ్బందిగా మారింది. గోవుల సంచారంతో పార్కు అధ్వానంగా మారింది. పశువుల రాకను నియంత్రించే వారే లేకపోవడంతో పార్కుకు వచ్చే ఆటగాళ్లు, వ్యాయామదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఉదయాన్నే వ్యాయామం చేసేందుకు వస్తున్న వారు పేడలను ఎత్తుకునే దుస్థితి నెలకొంటోంది.

పట్టించుకోని అధికారులు

ఈ విషయమై వెటర్నరీ సిబ్బందికి ఫిర్యాదు చేయగా వారు సరిగా స్పందించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. తూతూ మంత్రంగా అప్పటికి పశువులను అక్కడ నుంచి తరలిస్తున్నారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పార్కుకు వచ్చే సందర్శకులు, క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. చుట్టు పక్కలు, రోడ్లపైనే గోవులను పెంచే పెంపకదారులకు మాత్రం ఎటువంటి హెచ్చరికలు చేయడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

10 నుంచి పోస్టల్ టెన్నిస్ టోర్నమెంటు

ఎంవీపీ కాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల పదో తేదీ నుంచి పద్నాలుగు వరకూ విశాఖలో 40 ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంటు నిర్వహించనున్నట్టు విశాఖ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ ఎస్వీఎస్ఎన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా తేదీల్లో ఎంవీపీ కాలనీలోని ఎస్-3 స్పోర్ట్స్ ఎరీనాలో క్రీడలు జరుగుతాయని, 14 సాయంత్రం ముగింపు వేడుకలు ఉంటాయని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సాహించేలా నగరవాసులు సహకరించాలని కోరారు.

అప్పన్న భక్తులకు మౌలిక సదుపాయాలు కరువు

సింహాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామివారి దర్శనానికి వస్తున్న భక్తులకు కనీస సదుపాయాలు కల్పించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. కొండదిగువ దేవస్థానం బస్టాండ్, పూదోటకు మధ్యన రెండు సులాభ్ కాంప్లెక్స్‌లు కొన్నేళ్ల క్రితం వరకు ఉండేవి. వీటిలో పక్కా భవనంతో ఉన్న కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో కూల్చివేశారు. గతేడాది గిరిప్రదక్షిణ ఉత్సవం కోసం తాత్కాలిక సులాభ్ కాంప్లెక్స్‌ను తొలగించి దూరంగా పడేసి, నిరుపయోగంగా మార్చేశారు. నాటి నుంచి దాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు నిర్లక్ష్యంవహిస్తున్నారు. వారపు సంతలో ఉన్న సులాభ్ కాంప్లెక్స్ కూడా చాలావరకు మరమ్మతుకు గురైంది. అంతేకాదు కొండ దిగువన ఎక్కడా భక్తులకు సరైన వసతి సౌకర్యం కూడా లేదు.

ఢిల్లీలో హ్యాబిటెట్ సెంటర్ పనితీరు పరిశీలన

- వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



ఢిల్లీలోని హ్యాబిటెట్ సెంటర్ వద్ద వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఏడీసీ రమేశ్

సిరిపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీల్లో పేరొందిన ఇండియా హ్యాబిటెట్ సెంటర్‌ను వీఎంఆర్‌డీ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, అదనపు కమిషనర్ రమేశ్ శనివారం సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ గృహ, పట్టణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులు జరుగుతున్న 18వ 'అర్బన్ మొబిలిటీ ఇండియా కాన్ఫరెన్స్ అండ్ ఎక్స్-2025' సదస్సులో పాల్గొనేందుకు వెళ్లి పలు అంశాలపై సమీక్షిస్తున్నారు. విశాఖపట్నంలో వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో పీపీపీ విధానంలో ఈస్ట్‌కోస్ట్ హ్యాబిటెట్ సెంటర్‌ను నిర్మించనున్న నేపథ్యంలో ఢిల్లీలో సెంటర్‌ను పరిశీలించారు. హ్యాబిటెట్ సెంటర్ నిర్మాణ శైలి, కన్వెన్షన్ సెంటర్లు, మీటింగ్ హాల్స్, కార్యాలయాల నిర్మాణం ఏ తీరుగా ఉన్నాయనేది పరిశీలించారు. దీని నిర్మాణం, నిర్వహణ వంటి అంశాలపై సెంటర్ జీఎం అమర్నాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. విశాఖ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపుతున్న చొరవ, ఇక్కడ రూపుదిద్దుకుంటున్న ప్రాజెక్టులు, ఈ నేపథ్యంలో నిర్మించతలపెట్టిన హ్యాబిటెట్ సెంటర్ ఆవశ్యకతను వారు వివరించారు. జాతీయ సదస్సు ఆదివారంతో ముగియనుండగా, వీఎంఆర్‌డీఏకు సంబంధించిన ఇతర అంశాలపై చర్చించనున్నట్లు వారు వెల్లడించారు.

స్కిల్ పోటీల్లో చంద్రంపాలెం విద్యార్థుల ప్రతిభ

కొమ్మాది, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి స్కిల్ పోటీల్లో చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్టు హెచ్‌ఎం వెంకట్రావు తెలిపారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు.

నగరంలో సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి స్కిల్ పోటీల్లో తమ విద్యార్థులు గుడాల రాకేశ్, తేలు కల్యాణి పలు విభాగాల్లో ప్రతిభ చూపి ఈనెల 14న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు.

ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన వారిని ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్, డీఈవో ప్రేమ్‌కుమార్ తదితరులు అభినందించారు.

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం

- వారాల తరబడి చెత్త తరలింపు చేపట్టకపోవడంతో అధ్వానంగా పరిసరాలు
- తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- పారిశుధ్య విభాగం పనితీరుపై ప్రజల అసంతృప్తి



మద్దిలపాలెం ఉమామహేశ్వర ఆలయం పక్కన నిండా పూడికలతో నిండిన గెడ్డ

మద్దిలపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు శివాజీపార్క్ రోడ్డులో పారిశుధ్య నిర్వహణ పరమ అధ్వానంగా తయారైందని స్థానికులు మండిపడుతున్నారు. గత పది రోజుల నుంచి పార్కు రోడ్డులోని నర్సరీ వద్ద చెత్తకుప్పలు పేరుకుపోయాయి. చెత్త వేసేందుకు పెట్టిన డంపర్‌బిన్లు నిండిపోయి రోడ్డంతా చెత్తాచెదారమయంగా తయారైంది. కిరణా షాపులు, ఇళ్లల్లోని వ్యర్థ పదార్థాలను రోడ్డు పక్కన పడేస్తున్నారు. రోడ్డుపై చెత్త పారవేస్తే ఫైన్ వేస్తామన్న జీవీఎంసీ కమిషనర్ హెచ్చరికలను సైతం స్థానికులు పట్టించుకోవడం లేదు. చెత్తను తెచ్చి దర్జాగా రోడ్డు పక్కన పడేస్తున్నారు. దీంతో పరిసరాలు వ్యర్థాలతో నిండి దుర్గంధంగా తయారవుతున్నాయి. కుళ్లిన ఆహార పదార్దాలు పారవేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ దుర్వాసన భరించలేక ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కుళ్లిన ఆహారాలు ఆవులు మేస్తున్నాయి. చెడిపోయిన ఆహారం తీసుకోవడం వలన మూగజీవాలు అనారోగ్యం బారిన పడే అవకాశాలున్నాయి. పారిశుధ్య కార్మికులు పేరుకు పోయినచెత్తను తొలగించడం లేదు. డంపర్‌బిన్లలో నిండిన చెత్తను తరలించే వాహనాలు కూడా రాకపోవడంతో గత పది రోజులుగా రోజులుగా రోడ్డు పక్కన చెత్తకుప్పలు పేరుకుపోయాయి. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.



శివాజీపార్క్ రోడ్డు నర్సరీ వద్ద రోడ్డు పక్కన ఉన్న చెత్తను తింటున్న పశువులు

దుర్గంధంతో భక్తుల ఇబ్బంది..

అలాగే మద్దిలపాలెం ఉమామహేశ్వర ఆలయం పక్కన గెడ్డలో పూడికలు పేరుకుపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. చెత్త చెదారాలతో గెడ్డ నిండిపోవడంతో మురుగునీరు ప్రవహించే అవకాశం లేక నిలిచిపోయింది. ఫలితంగా భక్తులు దుర్వాసనతో సహజీవనం చేస్తున్నారు. కార్తీక మాసం కావడంతో ఉమామహేశ్వరుని ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. కాగా ఆలయం పక్కనే దుర్వాసన వెదజల్లుతూ గెడ్డ ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు సైతం గెడ్డ నుంచే దుర్వాసన భరించలేకపోతున్నారు. రోజుల తరబడి గెడ్డలో పూడికలు తొలగించడం లేదని స్థానికులు చెబుతున్నారు. చేసేది లేక కంపు భరిస్తూ ఉన్నామని వాపోతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి పూడికలు తొలగించాలని కోరుతున్నారు.

సినిమా గైడ్

- **ది గర్ల్ ఫ్రెండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **జటాధర** : శారదా, శ్రీకన్య
- **బ్యాడ్ ల్యాండ్స్ / ఫినిక్స్** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : వెంకటేశ్వర-1.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 26, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 66, బెండకాయలు 48, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 50, బీరకాయలు 60, ఆనపకాయ 38, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 24, క్యారెట్ 58, దొండకాయలు 42, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 64, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

వేడుకగా శ్రీప్రకాశ్ కిడ్స్ డే



ఆటపాటలతో చిన్నారుల అభినయం

సిరిపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శ్రీప్రకాశ్ విద్యానికేతన్ చిన్నారుల కిడ్స్ డే సంబరాలు శనివారం వేడుకగా నిర్వహించారు. వివిధ వేషధారణలతో వేదికపై చిన్నారులు చేసిన నృత్యాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంస్కృతీసంప్రదాయాలు భావితరం పిల్లలకు తెలియజేసేందుకే ఇలాంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసుప్రకాశ్ పేర్కొన్నారు. వేడుకలో పాల్గొన్న పలువురు అతిథులను ఆయన సన్మానించారు. కిండర్ గార్డెన్‌లో యూకేజీ ముగించుకున్న చిన్నారులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా స్నాతకోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శనకు ప్రత్యేక ప్రదర్శనగా ఉంచారు. వీటిని విద్యార్థులతో పాటు, తల్లిదండ్రులు, అతిథులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో డాక్టర్ అనూరాధ, డాక్టర్ పెదవీర్రాజు, గీతా రామానుజన్, వంకాయల సన్యాసిరాజు తదితరులు మాట్లాడారు.

'సేవా కార్యక్రమాలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు'

ఆరిలోవ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచి సేవా కార్యక్రమాలు విద్యార్థులు అలవరచుకోవడం ద్వారా నాయకత్వ లక్షణాలు, సేవా భావం అలవడుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు పేర్కొన్నారు. శనివారం ఉదయం తోటగరువులో గల ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సేవా శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాభావం విద్యార్థులకు అవసరమన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ మూర్తి నూకల మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సుమారు ఏడు రోజుల పాటు ఈ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి వినోద్‌కుమార్, 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ సమస్యలపై పీఎఫ్ కమిషనర్‌కు వినతి

తగరపువలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు కార్మిక పింఛన్‌దారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ అవినాష్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈమేరకు వారు నగరంలోని పీఎఫ్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిశారు. మిల్లు యాజమాన్యం ఆరేళ్లుగా కార్మిక పింఛన్‌దారులకు 10బి ఫారం ఇవ్వడం లేదని, అక్కడ అడగడానికి కూడా ఎవరూ అందుబాటులో లేరని కార్మిక పింఛన్‌దారుల సంఘం కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్, చిట్టివలస సంఘం కార్యదర్శి డి. బాబాజీ, సహాయ కార్యదర్శి ఎం.అప్పలరాజు తెలిపారు.

పింఛన్‌దారుల వివరాలను ఆన్‌లైన్‌లో పంపించాల్సి ఉండగా, మిల్లు మూతపడడం వల్ల పంపడం లేదని చెప్పారు.

కన్నుల పండువగా ముగిసిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వడ్డిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

వెంకోజిపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాత వెంకోజిపాలెంలోని శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న శ్రీగౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు శనివారం కన్నుల పండువగా ముగిశాయి. భక్తులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సారె పూజలో భక్తులు తీసుకొచ్చిన మిఠాయిలను అన్నదాన కార్యక్రమంలో వినియోగించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గవర కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు మళ్ల రవికుమార్, తదితరులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ అమ్మవారి ఊరేగింపు పురవీధుల్లో వైభవంగా సాగింది. మహిళలు తలపై ఉత్సవ విగ్రహాలను మోస్తూ వీధుల్లో ఊరేగించారు. తప్పెటగుళ్లు, కోలాటం, సాముగరిడీ తదితర జానపద కళారూపాలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, జనసేన నాయకులు పీల వెంకటపరదేశినాయుడు, సంఘం గౌరవాధ్యక్షుడు మళ్ల పోలిరాజు, అధ్యక్షుడు కర్రి వెంకట సూరి అప్పారావు, ఇతర కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవం వేదిక మార్పు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి, దీపోత్సవ కమిటీ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం విశాఖలో ఈ నెల పదిన ఏర్పాటు చేసిన శ్రీమహాలక్ష్మి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కార్తీక దీపోత్సవం వేదికను మార్చినట్టు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు. వచ్చే సోమవారం సాయంత్రం రుషికొండలోని వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్వహించాలని తొలుత నిర్ణయించినప్పటికీ భక్తుల రద్దీ, వారికి కల్పించాల్సిన సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని వేదికను వుడా పార్కు సమీపంలోని ఎంజీఎం పార్కులోకి మార్చినట్టు తెలిపారు. దీపోత్సవానికి టోకెన్ కలిగిన భక్తులను మాత్రమే అనుమతిస్తారని, ఇతరులకు అనుమతించరని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎమ్మెల్యేను కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధులు శనివారం ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశారు.

రోలర్ స్కేటింగ్‌లో మూడు స్వర్ణ పతకాలు

- డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థిని విద్యాప్రజాపతి ప్రతిభ



స్వర్ణ పతకాలతో విద్యాప్రజాపతి

మద్దిలపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థిని విద్యాప్రజాపతి రోలర్ స్కేటింగ్‌లో మూడు బంగారు పతకాలు గెలుచుకొంది. ఇటీవల కాకినాడలో నిర్వహించిన అంతర్ రాష్ట్రీయ (ఇంటర్ స్టేట్) రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మూడు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. రింక్ 2 (500+డి), రింక్ 3 (వెయ్యి మీటర్లు),రోలర్ రోడ్డు-2 (3 వేల మీటర్లు) విభాగాల్లో బంగారు పతకాలు సాధించి, వచ్చే నెల విశాఖలో నిర్వహించే జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత, అధ్యాపకులు వేదవ్యాస్, ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావులు విద్యార్థిని విద్యాప్రజాపతికి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మరిన్ని విజయాలు సాధించాలని, జాతీయస్థాయిలో కూడా విజయం సాధించి రాష్ట్రానికి, కళాశాలకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సత్యసాయి మహిళా విభాగం సేవ



బీచ్‌రోడ్డులో విగ్రహాలను శుభ్రం చేస్తున్న సత్యసాయి సేవా సమితి మహిళా విభాగం

ఎంవీపీ కాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా శ్రీసత్యసాయి మహిళా యువత విభాగం ఆధ్వర్యంలో శనివారం నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీచ్ రోడ్డులోని విగ్రహాలను శుభ్రం చేయడంతో పాటు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా శత వార్షిక జన్మదినోత్సవంలో భాగంగా బీచ్ రోడ్డులోని మహనీయుల విగ్రహాలను పరిశుభ్రపరిచారు. వంద ఆటోలపై 'నిదానమే ప్రధానం', 'తొందరగా బయలుదేరు.. నెమ్మదిగా వెళ్లు.. భద్రంగా చేరుకో' తదితర నినాదాలతో కూడిన స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు నాయుడు, కన్వీనర్ సాయికుమార్, సమన్వయకర్త సోమేశ్వరి, యూత్ కన్వీనర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వద్దంటూ సంతకాల సేకరణ


సంతకాలు సేకరిస్తున్న వైసీపీ నేతలు

అక్కయ్యపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించరాదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. వైసీపీ ఆధ్వర్యంలో శనివారం నరసింహనగర్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ పరిసర ప్రాంతాలకు చెందిన వారి నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే ఫీజులు పెరిగిపోతాయని, తద్వారా పేద విద్యార్థులకు విద్య దూరమవుతుందన్నారు. అందుకోసం ప్రైవేటు వ్యక్తులకు మెడికల్ కాలేజీలను అప్పగించరాదన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆస్పత్రికి
రూ.1.5 లక్షల విరాళం


ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావుకు చెక్ అందజేస్తున్న నరసింహారావు

సీతమ్మధార, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధారలో లయన్స్ కాన్సర్, జనరల్ ఆస్పత్రిని సందర్శించిన జిల్లా విశ్రాంత నాయ్యమూర్తి సలాది నరసింహారావు తన తండ్రి సలాది గంగరాజు జ్ఞాపకార్థం ఆస్పత్రుల్లో అల్ట్రా సౌండ్, కలర్ డాప్లర్ గది ఆధునికరణ నిమిత్తం రూ.1,50,000 చెక్కును విరాళంగా అందచేశారు. ఈ చెక్కును లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావుకు అందచేశారు. ఈ సందర్భంగా సలాది నరసింహారావును ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ అభినందించింది.

నత్తనడకన సచివాలయ భవన నిర్మాణం

- ఏడాదిన్నర గడచినా.. పూర్తి కాని అంబేడ్కర్ కాలనీలోని భవనం
- కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం


అంబేడ్కర్ కాలనీలో ఏడాదిన్నర నుంచి నిర్మాణంలోనే ఉన్న సచివాలయ భవనం

మాధవధార, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర నియోజకవర్గంలోని వార్డు సచివాలయాలకు సరైన వసతి కరువైంది. ప్రత్యేకించి మాధవధార, మురళీనగర్, బర్మా క్యాంప్, ఎన్‌జీజీవోస్ కాలనీ ప్రాంతాల్లో ఆదరా బాదరాగా కల్యాణ మండపాలు, సామాజిక భవనాలు, పూర్వ మీసేవ కార్యాలయాలను సచివాలయాల కోసం తొలినాళ్లలో కేటాయించారు. మురళీనగర్‌లో కొన్ని సచివాలయాలను నేటికీ అద్దె భవనాల్లోనే నడిపిస్తున్నారు. అప్పటివరకు ఉన్న అంగన్‌వాడీ భవనంలో సగ భాగం తీసుకొని సత్యానగర్‌లో ఓ సచివాలయం పెట్టారు. కొత్త భవనం నిర్మించి సత్యానగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని కొద్ది నెలల క్రితమే అందులోకి తరలించారు. దాదాపు ఏడాదిన్నర క్రితమే వైసీపీ సర్కారు హయాంలోనే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ సచివాలయం పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. కేవలం 40 గజాల స్థలంలో ఒక అంతస్తుగా భవనం కట్టడానికి రూ.16 లక్షలు మంజూరు చేశారు. ఆ తర్వాత అంబేడ్కర్ కాలనీ రోడ్డు విస్తరణ, 80 అడుగుల రోడ్డు ప్రతిపాదన రావడంతో కొన్ని నెలలు మీమాంసలో నిలిపివేశారు. వెరసి 40 గజాల జాగాలో ఒక స్లాబు వేసి రెండు గదులు కట్టడానికి ఏడాదిన్నర పూర్తవుతున్నా, పనులు కొలిక్కి రాలేదు! ప్రస్తుతం ముగింపు పనుల పేరిట మరో రూ.5 లక్షల కోసం ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారుల అనుమతికి దస్త్రం పంపినటేకట ఏఈ సాయినాథ్ తెలిపారు. అంటే..ఒక్క అంతస్తు కట్టడానికి మొత్తంగా జీవీఎంసీ చేస్తున్న ఖర్చు రూ.21 లక్షల పైమాటే. పనులు పూర్తి చేయడానికి కాంట్రాక్టరు, జీవీఎంసీ అధికారులు నిర్ణీత గడువు లేకుండా నత్తను తలపిస్తున్నారు. పూర్వ మీసేవ భవనంలో కొనసాగిన 286, 289 సచివాలయాల్ని జోనల్ కార్యాలయం ఏర్పాటవుతుండడంతో ఇటీవల మరో రెండు సచివాలయాల్లో తాత్కాలికంగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా భవన నిర్మాణం తొందరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విశాఖ, నౌపడ, పర్లాకిమిడి సెక్షన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా,పాల్గొన్న రైల్వేఅధికారులు

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు డివిజన్ పరిధిలోని విశాఖ, నౌపడ, పర్లాకిమిడి సెక్షన్‌లో డీఆర్‌ఎం లలిత్ బొహ్రా శనివారం పర్యటించి తనిఖీలు చేశారు. స్టేషన్లలో ప్రయాణికుల మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్లాట్‌ఫామ్‌ల పెంపు, అప్‌గ్రేడ్ చేసిన తాగునీరు సౌకర్యం, ప్లాట్‌ఫామ్‌లపై షెల్టర్లు ఏర్పాటు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, దివ్యాంగులకు ప్రత్యేక చర్యలు వంటి వాటిపై దృష్టి సారించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సౌకర్యాల నిర్వహణను పరిశీలించి, ఏర్పాటు చేయాల్సిన సదుపాయాలపై అధికారులతో చర్చించారు. ఇక విజయనగరం, పర్లాకిమిడి, దూసి స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్టేషన్ల ఆధునికీకరణలో సుందరీకరణకు ప్రాధాన్యమివ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. విండో ట్రైలింగ్ ద్వారా సెక్షన్‌లోని వంతెనలు, క్రాసింగ్‌లు, స్టేషన్ యార్డులు వంటి వాటిని పరిశీలించారు. ఈ పర్యటనలో సీనియర్ డీఈ (ఈస్ట్) బి.సాయిరాజ్, సీనియర్ డీవోఎం అవినాష్, సీనియర్ డీసీఎం పవన్‌కుమార్, సీనియర్ డీఈఈ ఎంఎస్ఎన్.మూర్తి ఉన్నారు.

రిటైర్డ్ ఏడీసీపీ మహమ్మద్‌ఖాన్‌కు సత్కారం


మహమ్మద్‌ఖాన్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మురళీనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వెటరన్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపిన పోలీసు శాఖ రిటైర్డ్ ఏడీసీపీ మహమ్మద్ ఖాన్‌ను శనివారం మురళీనగర్‌లోని వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం (వావ్) సభ్యులు సత్కరించారు. అధ్యక్షుడు ఎం. వరప్రసాద్, పీఆర్వో సీహెచ్ వంశీ తదితరులు శాలువా కప్పి సత్కరించారు. ఇటీవల నిర్వహించిన జిల్లా పోటీల్లో రిటైర్డ్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ మహమ్మద్‌ఖాన్ 100 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణం, జావెలిన్ త్రో పోటీల్లో రజత పతకాల్ని గెలుపొందినట్లు వావ్ అధ్యక్షుడు ఎం.వరప్రసాద్ తెలిపారు. డిసెంబరు 13, 14 తేదీల్లో గుంటూరులో జరిగే 45వ ఏపీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలకు కూడా అర్హత సాధించినట్లు తెలియజేశారు. నగర పోలీస్ కమీషనరు శంఖబ్రత బాగ్చీ నుంచి కూడా ప్రశంసలందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమల్ బయిద్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సీపీఆర్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అక్కయ్యపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ కంపుల్స్, అపోలో హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు చెప్పించుట ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యారాలు జయంతి రాధా కుమారి, ఎన్‌సీసీ అధికారి ఎంఎస్‌వీ విశ్వనాథం, ఉపాధ్యాయురాలు గ్లోరీ, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల రాంప్రసాద్, షాహిదా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు

మురళీనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) ; జీవీఎంసీ 49వ వార్డు బర్మాక్యాంప్ ఏఎస్సార్‌నగర్‌లో జైలాల్ అల్లూరి శ్రీగౌరీసేవాసంఘం ఆధ్వర్యంలో అక్టోబరు 30 నుంచి నిర్వహించిన గౌరీ పరమేశ్వరుల నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. సాయంత్రం మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం గ్రామంలో శివపార్వతుల ఊరేగింపు నిర్వహించి సాగర నిమజ్జనానికి తరలించారు. సంఘం అధ్యక్షుడు కె.శివఅప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎ.పాపారావు తదితరులు ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లు చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాల మధ్య కోలాహలంగా సాగిన నిమజ్జన ఊరేగింపులో బర్మా క్యాంప్, ఏఎస్సార్ నగర్, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల నుంచి స్థానికులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను జయించి...

... 5వ పేజీ తరువాయి

కొందరు స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్లారు. దానిని కొనసాగిస్తూ వచ్చారు. ఈ క్రమంలో పూణెకు చెందిన గిరి ప్రేమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరో ఐదుగురు మహిళలతో కలిసి గత నెల మూడో తేదీన ఎవరెస్ట్ పర్వతారోహణకు వెళ్లారు. 12వ తేదీ నాటికి బేస్ క్యాంపునకు చేరుకుని తిరిగి 17వ తేదీ నాటికి వెనక్కి వచ్చారు. మహిళలు చిన్నచిన్న సమస్యలకు కుంగిపోకుండా ధైర్యంగా ఉండాలని, ఆత్మస్థైర్యంతో ముందుకుసాగితే విజయాలను సాధించగలమని మున్నీ పేర్కొన్నారు.

మెగాసిటీగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

ప్లాన్ చేస్తున్నారు. అదేవిధంగా విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్‌లో పర్యాటక ప్రాజెక్టులు అనేకం వస్తున్నాయి. విశాఖ నుంచి ఆనందపురం మీదుగా అనేక పేరొందిన విద్యా సంస్థలు ఐఐఎం, అనిట్స్, గాయత్రి, అవంతి, రఘు ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ఇవన్నీ ఈ మెగాసిటీకి గ్రోత్ ఇంజన్లుగా ఉపకరిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

డీపీఆర్ తయారుచేస్తాం
ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

రాంబిల్లి నుంచి భోగాపురం వరకు సెమీ రింగ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన అధ్యయనం కోసం కన్సల్టెంట్‌ను నియమించాం. ఆ మార్గం ఎలా ఉండాలి?, ఎటువైపు తీసుకువెళ్లాలి?...అనే అంశాలపై నివేదిక వస్తుంది. దాని ప్రకారం డీపీఆర్ తయారుచేస్తాం. ఇది త్వరగానే కార్యరూపంలోకి వస్తుంది.

25 ఏళ్లలో శ్రీకాకుళం కూడా కలుస్తుంది
పీవీఎన్ మాధవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వం అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం ఒక స్ట్రిప్ కింద అభివృద్ధి చేయాలని భావిస్తోంది. అందులో భాగంగానే సెమీ రింగ్ రోడ్డు ప్రతిపాదించారు. ఇది ఎంతవరకు ఉపయోగపడుతుందనే దానిపై చర్చలు జరుగుతున్నాయి. రాబోయే 25 ఏళ్లలో శ్రీకాకుళం కూడా వీటితో కలిసిపోనుంది.

పెరిగిన కూరగాయల ధరలు

... 5వ పేజీ తరువాయి

చిన్నదైతే రూ.20, పెద్దదైతే రూ.30కి దొరికేది. ఇప్పుడు వాటిని రూ.40 కంటే తక్కువకు ఇవ్వడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో బీర, బెండ, దొండ, అనప పండిస్తున్నారు. వీటిని రైతులు పది రూపాయలు అటుఇటుగా అమ్మేసి త్వరగా ఇంటికి వెళ్లిపోతున్నారు. ఇతర జిల్లాల నుంచి హోల్‌సేల్ వ్యాపారులు తెప్పిస్తున్న బీన్స్ రకాలు, క్యారెట్, బీట్‌రూట్ తదితరాల ధరలు అధికంగానే ఉన్నాయి. ఇది కార్తీకమాసం, అయ్యప్ప స్వాముల దీక్షలు ప్రారంభం కావడంతో అత్యధికులు శాకాహారమే తీసుకుంటున్నారు. దాంతో కూరగాయల వినియోగం బాగా పెరిగింది. రేటు ఎక్కువ పెట్టినా తప్పనిసరిగా కొంటారనే ధీమా ఉండడంతో హోల్‌సేల్ వ్యాపారులు డిమాండ్‌కు సరిపడా సరకులు తెప్పించకుండా కొంచెం తక్కువ రప్పిస్తూ కృత్రిమ డిమాండ్ సృష్టించి అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. దీనిపై వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు దృష్టి పెడితే సరకుల లభ్యత పెరిగి ధరలు తగ్గుతాయి.

రక్తమోడుతున్న రోడ్లు

... 5వ పేజీ తరువాయి

క్షతగాత్రులయ్యారు. గత వారం రోజుల్లోనే రోడ్డు ప్రమాదాల కారణంగా సుమారు 15 మంది వరకు మృత్యువాతపడ్డారు. గత మూడేళ్లుగా రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుతూ వచ్చినప్పటికీ ఈ ఏడాది ప్రమాదాల సంఖ్యతోపాటు మరణాల సంఖ్య కూడా పెరిగేలా ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

సీపీ దృష్టిసారించకపోతే మరింత పెరిగే అవకాశం

పెండింగ్ చలాన్‌ల వసూళ్లపై కాకుండా వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టిపెట్టాల్సిందిగా సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీచేయాల్సిన అవసరం ఉంది. అలాగే కొందరు సిబ్బంది విధి నిర్వహణను పక్కనపెట్టి చెట్ల కింద కుర్చీలో కూర్చొని సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై కనిపించకపోవడంతో ఇష్టారాజ్యంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అదే ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై ఉంటే వాహన చోదకులు నిబంధనలను పాటిస్తారు కాబట్టి ప్రమాదాలకు ఆస్కారం తగ్గుతుంది. రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడంపై సీపీ దృష్టిసారించాలని నగరవాసులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు తీవ్ర పోటీ

... 5వ పేజీ తరువాయి

పోస్టులను మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేస్తారని, సిఫారసులను పరిగణనలోకి తీసుకోరని చెబుతున్నా అభ్యర్థులు వినిపించుకోవడం లేదు. 'మీరు లెటర్ ఇస్తే చాలు సర్. మిగిలిన పని మేము చూసుకుంటాం' అంటున్నారు. దీంతో పలువురు ఎమ్మెల్యేలు తప్పనిసరి పరిస్థితుల్లో లేఖలు ఇస్తున్నారు. ఇప్పటివరకూ సిఫారసు లేఖలతో 20 మంది వరకూ ఐసీడీఎస్ కార్యాలయానికి వచ్చినట్టు చెబుతున్నారు. మరికొందరు కార్యాలయ అధికారులకు స్థానిక ప్రజా ప్రతినిధులతో ఫోన్లు చేయిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మన వాళ్లకు వచ్చేలా చూడండని కొందరు నేతలు చెబుతున్నట్టు తెలుస్తోంది.

భారీగా దరఖాస్తులు..

భీమునిపట్నం ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఐదు కార్యకర్తల పోస్టులకు 32 మంది దరఖాస్తు చేశారు. అలాగే, విశాఖ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న రెండు కార్యకర్తల పోస్టులకు మరో 32 మంది అభ్యర్థులు దరఖాస్తులు వచ్చాయి. అలాగే, భీమునిపట్నం ప్రాజెక్టు పరిధిలో 11, పెందుర్తి ప్రాజెక్టు పరిధిలో 21, విశాఖ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో 21 హెల్పర్ పోస్టులకు 193 మంది దరఖాస్తుచేశారు. ఆయా దరఖాస్తులను ప్రస్తుతం అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు. అయితే, దరఖాస్తు చేసిన వారిలో దాదాపు ప్రతి ఒక్కరూ రాజకీయంగా పలుకబడిని ఉపయోగిస్తుండడంతో అధికారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయిన తరువాత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించి నియామక పత్రాలు అందిస్తామని చెబుతున్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం
- దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


బాధితురాలికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో 31వ వార్డుకు చెందిన సింగంపల్లి పద్మకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.1,07,233 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో వైద్యం చేయించుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడే పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప వరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'కేజీహెచ్‌పై తప్పుడు ప్రచారం తగదు'

మహారాణిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌పై తప్పుడు ప్రచారం చేస్తే వైసీపీ నాయకులకు రాజకీయ భవిష్యత్తు ఉండదని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేజీహెచ్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి రోగులు ఇబ్బందులు పడ్డారని వైసీపీ నాయకులు ఆరోపించడం సరికాదన్నారు. ఆస్పత్రిలో నీటి సరఫరా పైపులైన్ పనుల కోసం జరిపిన తవ్వకాల వల్ల జేసీబీ బకెట్ తగిలి విద్యుత్ కేబుల్ లైన్లు తెగిపోయాయని, దీనివల్ల మధ్యాహ్నం 2 నుంచి సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించారన్నారు. రోగులకు ఇబ్బంది కలగకుండా ఐదు జనరేటర్లతో సరఫరా అందించారని తెలిపారు. ఇవేవీ తెలియకుండా వైసీపీ నాయకులు ఇష్టారీతిన మాట్లాడడం సరికాదన్నారు. అసత్య ప్రచారాలు చేస్తే వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి 11 సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు.

వందేమాతరం గేయాలాపన

మహారాణిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లోని స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం వందేమాతరం గేయాలాపన సామూహికంగా నిర్వహించారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా వన్‌టౌన్‌లోని స్వర్ణకారుల సంఘం, విశ్వబ్రాహ్మణుల సంఘం, వీర బ్రహ్మేంద్రస్వామి ఆధ్యాత్మిక పూజా మందిరం కార్పెంటర్ల సంఘం, ఇతర సంఘాల ఆధ్వర్యంలో గేయాలాపన జరిపారు. ఈ సందర్భంగా 38వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గోడి నరసింహాచారి వందేమాతరం గేయం విశిష్టతను తెలియజేశారు.

నేడు కుసుమ, హరనాథుల కల్యాణం

డాబాగార్డెన్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్‌నగర్‌లోని కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకుసుమ, హరనాథుల లీలా కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆశ్రమ అధ్యక్ష, కార్యదర్శులు బీటీ బాబాజీ,ఆర్‌వీఎస్ రమేశ్ తెలిపారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవానికి వ్యాఖ్యాతగా ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్ వ్యవహరిస్తున్నారని చెప్పారు.

రాజ్యాంగ దినోత్సవం వేడుకలకు జీవీఎంసీ విద్యార్థి రాజేశ్

డాబాగార్డెన్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో ఈనెల 26న జరిగే రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొనేందుకు డాబాగార్డెన్స్‌లోని జీవీఎంసీ మహాత్మాగాంధీ పాఠశాలలో 9వ తగరతి చదువుతున్న రాకేశ్ పాత్రో ఎంపికయ్యాడు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోటీ పరీక్షల ద్వారా ఒక్కొక్క విద్యార్థిని ఎంపిక చేసి, రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. తమ పాఠశాల నుంచి రాకేశ్ ఎంపికైనట్టు పాఠశాలహెచ్‌ఎం ఆర్‌వీవీఎస్ నాగభూషణం తెలిపారు.


భీమ్‌నగర్ డిస్పెన్సరీ ఎదురుగా రోడ్డు దుస్థితి


కృష్ణాగార్డెన్స్ నుంచి అంబేడ్కర్ జంక్షన్‌కు తిరిగే మలుపులో పాడైన రహదారి

అధ్వాన రహదారులతో అవస్థలు

- అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఎల్ఐసీ, భీమ్‌నగర్, వివేకానంద్ వరకు గోతులమయమైన రోడ్లు
- ఏళ్ల తరబడి మరమ్మతులు కరువు
- రాకపోకలకు వాహనదారుల తీవ్ర ఇబ్బందులు

డాబాగార్డెన్స్ నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి భీమ్‌నగర్, కృష్ణా గార్డెన్స్ వివేకానంద సర్కిల్ వరకు ఉన్న రహదారులు గోతులతో అధ్వానంగా ఉన్నాయి. ఈ రోడ్లలో ప్రయాణించాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఒకవైపు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నటికీ నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ రహదారులను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. నగరంలోకి వివిధ ప్రాంతాలు, జిల్లాల నుంచి వచ్చేవారు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు, రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ఈ రోడ్లను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇటీవల ఈ రోడ్లు పూర్తిగా గోతులు పడ్డాయి. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ఒక వాహనం వెనుక మరో వాహనం వచ్చినప్పుడు గోతుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి రహదారులలో గోతుల పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రెండు సార్లు పడిపోయాను
- ఎం.విక్రమ్ వాహనదారుడు



భీమ్‌నగర్ నుంచి ఎల్ఐసీ రోడ్డుకు వచ్చే మార్గంలో రెండు సార్లు పడిపోయాను. రాత్రి వేళలో మినిమమ్ స్పీడ్‌లో వెళ్లినప్పటికీ గోతుల వల్ల ప్రమాదాలకు గురవుతున్నాం. అధికారులు తక్షణమే గోతులు పూడ్చాలి.

త్వరలోనే మరమ్మతులు చేస్తాం
జోన్ 4 కమిషనర్ మల్లయ్యనాయుడు



డాబాగార్డెన్స్ అంబేడ్కర్ సర్కిల్ నుంచి భీమ్‌నగర్ మీదుగా వివేకానంద విగ్రహం వరకు రహదారుల మరమ్మతుకు త్వరలోనే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రోడ్ల మరమ్మతుకు నిధులు కూడా మంజూరయ్యాయి. వేగంగా పనులు చేపట్టి వాహనదారుల ఇబ్బందులు తొలగిస్తాం.

వాట్సాప్ ద్వారా కనకమహాలక్ష్మి అమ్మవారి సేవల బుకింగ్

మహారాణిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహించే మార్గశిర మాసోత్సవాల్లో సేవలను వాట్సాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చునని అధికారులు ప్రకటించారు. ఈనెల 21 నుంచి డిసెంబరు 19 వరకు నిర్వహించనున్న ఉత్సవాల సందర్భంగా గురువారం జరిగే పంచామృతాభిషేకానికి రూ.10 వేలు, మిగిలిన రోజుల్లో రూ. 3 వేలుగా నిర్ణయించారు. విశిష్ట దర్శనం టికెట్లు రూ.500 ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 నెంబరు ద్వారా బుక్ చేసుకోవచ్చునని సూచించారు.

భక్తులతో సింహగిరి కిటకిట


ఆలయం లోపల భక్తుల రద్దీ

సింహాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు. కార్తీక మాసం రెండో శనివారం కావడంతో పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఒడిశా నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సింహగిరి కిటకిటలాడింది.సూర్యోదయానికి ముందే భక్తులు పుష్కరిణిలో, సింహగిరి మెట్ల మార్గంలోని జలధారల్లో పుణ్యస్నానాలు ఆచరించి, దీపారాధనలు చేశారు. తొలుత భైరవస్వామిని, కొండదిగువ స్వామివారి పూతోటలోని వేంకటేశ్వరస్వామిని, అప్పన్న సహోదరి అడివివరం గ్రామ దేవత పైడితల్లమ్మను దర్శించుకున్నారు. అనంతరం సింహాద్రినాథుడ్ని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.భక్తుల తాకిడితో అప్పన్న ఖజానాకు శనివారం ఒక్కరోజే రూ.44.56 లక్షల ఆదాయం సమకూరింది.

వాహనాల పార్కింగ్‌కు అవస్థలు

సింహగిరికి వస్తున్న భక్తులు వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో శనివారం తప్ప ఇతర రోజుల్లో పెద్దగా రద్దీ ఉండేది కాదు. గత మూడేళ్లుగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో సింహగిరిపై, కొండదిగువ వాహనాల పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పీఆర్‌ఓ కార్యాలయం ఎదురుగా, గజపతి సత్రం పరిసరాల్లో కార్లు, స్కూటర్లు పార్కింగ్ చేస్తున్నప్పటికీ కొన్ని వాహనాలకు స్థలం ఉండడం లేదు. అలాగే కొండదిగువన భక్తులను తీసుకువచ్చే ఆటోలు, ట్యాక్సీలు పార్కింగ్ ప్రాంతం లేక బస్సులు తిరిగే దేవస్థానం బస్టాండ్‌లో పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల కొన్నిసార్లు ఆర్టీసీ, దేవస్థానం బస్సులు రాకపోకలకు అవస్థలు పడాల్సి వస్తోంది.

సబ్ ట్రెజరీ కుంభకోణంలో
అధికారులపై చర్యకు మీనమేషాలు!

... 5వ పేజీ తరువాయి

36 మంది పాత్ర ఉన్నట్టు నిర్ధారించింది. అందులో ఇప్పటివరకూ నలుగురు చనిపోగా, 32 మంది ఉన్నారు. వారిలో కొందరు రిటైరయ్యారు. ఇంకా సర్వీస్‌లో 11 మంది సీనియర్ అకౌంటెంట్లు, మరికొందరు ఉప, సహాయ ఖజానా అధికారులు ఉన్నారు. సీనియర్ అకౌంటెంట్లకు జిల్లా స్థాయిలో డిప్యూటీ డైరెక్టర్ హోదా కలిగిన జిల్లా ఖజానా అధికారి మోహనరావు చార్జిమెమోలు ఇచ్చారు. అధికారులు మాత్రం విజయవాడలోని ఖజానా శాఖ డైరెక్టరేట్ పరిధిలోకి వస్తారు. అధికారులకు చార్జిమెమోలు జారీ చేయకుండా ఒత్తిళ్లు వస్తున్నాయని చెబుతున్నారు. కుంభకోణం వెలుగులోకి వచ్చిన తరువాత ఒకపక్క విచారణ జరుగుతుండగానే కొందరు సీనియర్ అకౌంటెంట్లకు ఉప ఖజానా అధికారులుగా, ఉప ఖజానా అధికారులకు సహాయ ఖజానా అధికారులుగా పదోన్నతులు కల్పించారు. నిబంధనల ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వకూడదు. కానీ సొమ్ములు తీసుకుని పదోన్నతులు ఇచ్చినట్టు చెబుతున్నారు. దోషులుగా విజిలెన్స్ గుర్తించిన అధికారులపై ఉన్నత స్థాయిలో ఒత్తిళ్లు కారణంగా ఇప్పుడు చర్యలకు వెనకడుగు వేస్తున్నారనే చర్చ ఖజానా శాఖలో జరుగుతోంది. ఏపీ ఉద్యోగుల సర్వీస్ రూల్స్ ప్రకారం ఒక ఉద్యోగి/అధికారి పదవీ విరమణ చేసి నాలుగుళ్లు దాటితే...అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకూడదు. సబ్‌ట్రెజరీ కుంభకోణంలో పాత్రధారులుగా తేలిన వారిలో పదవీ విరమణ చేసి నాలుగేళ్లు పూర్తికాని వారున్నారు. అందుకు కొద్దినెలలు మాత్రమే సమయం ఉన్నవారున్నారు. అటువంటి వారంతా చార్జిమెమోలు ఇవ్వకుండా చూసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. నాలుగేళ్లు పూర్తయిన తరువాత మెమోలు ఇచ్చినా సర్వీస్ రూల్స్ మేరకు చెల్లవని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక బహిర్గతం చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు. నివేదికలో పేర్కొన్న ప్రతి ఉద్యోగి/అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పశు సంచారంతో అధ్వానంగా అబ్దుల్ కలాం పార్కు

- గోవుల పేడ, మూత్రాలతో నిండిపోతున్న ఉద్యానవనం
- ఆటపాటలకు అవకాశం లేకుండా పోవడంతో యువత ఇబ్బందులు
- అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికుల అసంతృప్తి



పార్కు నిండా నిండిన ఆవు పేడమూత్రాలు



పార్కులో యథేచ్ఛగా సంచరిస్తున్న పశువులు

వెంకోజీపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ అబ్దుల్‌కలాం పార్కు నిర్వహణ అధ్వానంగా తయారైంది. పార్కును అభివృద్ధి చేయరు.. కనీసం పార్కులోకి పశువుల సంచారాన్ని అరికట్టరు.. దీంతోపార్కుకు వచ్చే ఆటగాళ్లు, వ్యాయామం చేసేవారు గోమూత్ర, విసర్జాలను ఎత్తుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

2014 ముందు ఈ పార్కు డెబ్రీస్‌తో నిండిపోయి డంపింగ్ యార్డును తలపించేది. ఆ తరువాత టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చొరవతో ఈ పార్కులో అభివృద్ధి పనులు చేపట్టారు. వాకింగ్ ట్రాక్, బోరు బావిని ఏర్పాటు చేశారు. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో పాటు వార్డు కార్పొరేటర్ ఎన్నికలు కూడా జరగడం, అదీ కూడా వైసీపీ కార్పొరేటరే ఎన్నికవడం జరిగింది. కానీ ఇక్కడొక పార్కు ఉందని గానీ, దీనిని అభివృద్ధి చేయాలని గానీ ఎటువంటి ఆలోచనలు కార్పొరేటర్ చేయలేదు. కాగా పార్కులో సచివాలయం నిర్మాణం చేసేందుకు ప్రయత్నం కూడా చేసి అప్పటి మేయర్ గొలగాని హరి వెంకటకుమారితో శంకుస్థాపన కూడా చేయించారు. దీనిపై వ్యతిరేకత రావడంతో జీవీఎంసీ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొంది అలాగే పార్కు అభివృద్ధి చేయండంటూ వినతులు అందడంతో మొక్కుబడిగా మూడు రకాల వ్యాయామ సామగ్రిని కూడా అధికారులు ఏర్పాటు చేశారు.

ఇటీవల కురిసిన వర్షాలు, గాలికి భారీ వృక్షం నేల కొరగడంతో పార్కుకు ఒక పక్క గోడ కూలిపోయింది. మరో పక్క చిన్న గేటు విరిగిపోవడంతో అక్కడ పశువులు, కుక్కలు వంటివి ప్రవేశానికి అవకాశం ఏర్పడింది. దీంతో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు షటిల్ ఆటగాళ్లు, కరాటే శిక్షకులు ఈ పార్కులో ఉంటారు. ఆ తరువాత సెలవు రోజులో అయితే కొందరు యువకులు క్రికెట్ ఆడతారు. మిగిలిన రోజుల్లో, మిగిలిన సమయంలో మందు బాబులు, గోవులకు ఈ పార్కు అడ్డాగా మారిపోయింది. ఒక పక్క వాకింగ్ ట్రాక్‌పైన, ఆ పక్కన మందుబాబు అధ్వానం చేస్తుంటే.. మరో పక్క పార్కు మధ్యలో షెటిల్ కోర్టులు, కరాటే శిక్షణ ప్రాంతంలోనూ గోవులు సేద తీరడమే కాకుండా మలమూత్రాలు విసర్జిస్తుండడం ఇబ్బందిగా మారింది. గోవుల సంచారంతో పార్కు అధ్వానంగా మారింది. పశువుల రాకను నియంత్రించే వారే లేకపోవడంతో పార్కుకు వచ్చే ఆటగాళ్లు, వ్యాయామదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఉదయాన్నే వ్యాయామం చేసేందుకు వస్తున్న వారు పేడలను ఎత్తుకునే దుస్థితి నెలకొంటోంది.

పట్టించుకోని అధికారులు

ఈ విషయమై వెటర్నరీ సిబ్బందికి ఫిర్యాదు చేయగా వారు సరిగా స్పందించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. తూతూ మంత్రంగా అప్పటికి పశువులను అక్కడ నుంచి తరలిస్తున్నారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పార్కుకు వచ్చే సందర్శకులు, క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. చుట్టు పక్కలు, రోడ్లపైనే గోవులను పెంచే పెంపకదారులకు మాత్రం ఎటువంటి హెచ్చరికలు చేయడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

10 నుంచి పోస్టల్ టెన్నిస్ టోర్నమెంటు

ఎంవీపీ కాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల పదో తేదీ నుంచి పద్నాలుగు వరకూ విశాఖలో 40 ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంటు నిర్వహించనున్నట్టు విశాఖ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ ఎన్వీఎస్ఎన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా తేదీల్లో ఎంవీపీ కాలనీలోని ఎస్-3 స్పోర్ట్స్ ఎరీనాలో క్రీడలు జరుగుతాయని, 14 సాయంత్రం ముగింపు వేడుకలు ఉంటాయని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సాహించేలా నగరవాసులు సహకరించాలని కోరారు.

అప్పన్న భక్తులకు మౌలిక సదుపాయాలు కరువు

సింహాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామివారి దర్శనానికి వస్తున్న భక్తులకు కనీస సదుపాయాలు కల్పించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. కొండదిగువ దేవస్థానం బస్టాండ్, పూదోటకు మధ్యన రెండు సులాభ్ కాంప్లెక్స్‌లు కొన్నేళ్ల క్రితం వరకు ఉండేవి. వీటిలో పక్కా భవనంతో ఉన్న కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో కూల్చివేశారు. గతేడాది గిరిప్రదక్షిణ ఉత్సవం కోసం తాత్కాలిక సులాభ్ కాంప్లెక్స్‌ను తొలగించి దూరంగా పడేసి, నిరుపయోగంగా మార్చేశారు. నాటి నుంచి దాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు నిర్లక్ష్యంవహిస్తున్నారు. వారపు సంతలో ఉన్న సులాభ్ కాంప్లెక్స్ కూడా చాలావరకు మరమ్మతుకు గురైంది. అంతేకాదు కొండ దిగువన ఎక్కడా భక్తులకు సరైన వసతి సౌకర్యం కూడా లేదు.

ఢిల్లీలో హ్యాబిటెట్ సెంటర్ పనితీరు పరిశీలన

- వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



ఢిల్లీలోని హ్యాబిటెట్ సెంటర్ వద్ద వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఏడీసీ రమేశ్

సిరిపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీల్లో పేరొందిన ఇండియా హ్యాబిటెట్ సెంటర్‌ను వీఎంఆర్‌డీ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, అదనపు కమిషనర్ రమేశ్ శనివారం సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ గృహ, పట్టణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులు జరుగుతున్న 18వ 'అర్బన్ మొబిలిటీ ఇండియా కాన్ఫరెన్స్ అండ్ ఎక్స్-2025' సదస్సులో పాల్గొనేందుకు వెళ్లి పలు అంశాలపై సమీక్షిస్తున్నారు. విశాఖపట్నంలో వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో పీపీపీ విధానంలో ఈస్ట్‌కోస్ట్ హ్యాబిటెట్ సెంటర్‌ను నిర్మించనున్న నేపథ్యంలో ఢిల్లీలో సెంటర్‌ను పరిశీలించారు. హ్యాబిటెట్ సెంటర్ నిర్మాణ శైలి, కన్వెన్షన్ సెంటర్లు, మీటింగ్ హాల్స్, కార్యాలయాల నిర్మాణం ఏ తీరుగా ఉన్నాయనేది పరిశీలించారు. దీని నిర్మాణం, నిర్వహణ వంటి అంశాలపై సెంటర్ జీఎం అమర్నాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. విశాఖ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపుతున్న చొరవ, ఇక్కడ రూపుదిద్దుకుంటున్న ప్రాజెక్టులు, ఈ నేపథ్యంలో నిర్మించతలపెట్టిన హ్యాబిటెట్ సెంటర్ ఆవశ్యకతను వారు వివరించారు. జాతీయ సదస్సు ఆదివారంతో ముగియనుండగా, వీఎంఆర్‌డీఏకు సంబంధించిన ఇతర అంశాలపై చర్చించనున్నట్లు వారు వెల్లడించారు.

స్కిల్ పోటీల్లో చంద్రంపాలెం విద్యార్థుల ప్రతిభ

కొమ్మాది, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి స్కిల్ పోటీల్లో చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్టు హెచ్‌ఎం వెంకట్రావు తెలిపారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు.

నగరంలో సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి స్కిల్ పోటీల్లో తమ విద్యార్థులు గుడాల రాకేశ్, తేలు కల్యాణి పలు విభాగాల్లో ప్రతిభ చూపి ఈనెల 14న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు.

ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన వారిని ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్, డీఈవో ప్రేమ్‌కుమార్ తదితరులు అభినందించారు.

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం

- వారాల తరబడి చెత్త తరలింపు చేపట్టక పోవడంతో అధ్వానంగా పరిసరాలు
- తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- పారిశుధ్య విభాగం పనితీరుపై ప్రజల అసంతృప్తి



మద్దిలపాలెం ఉమామహేశ్వర ఆలయం పక్కన నిండా పూడికలతో నిండిన గెడ్డ

మద్దిలపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు శివాజీపార్క్ రోడ్డులో పారిశుధ్య నిర్వహణ పరమ అధ్వానంగా తయారైందని స్థానికులు మండిపడుతున్నారు. గత పది రోజుల నుంచి పార్కు రోడ్డులోని నర్సరీ వద్ద చెత్తకుప్పలు పేరుకుపోయాయి. చెత్త వేసేందుకు పెట్టిన డంపర్‌బిన్లు నిండిపోయి రోడ్డంతా చెత్తాచెదారమయంగా తయారైంది. కిరణా షాపులు, ఇళ్లల్లోని వ్యర్థ పదార్థాలను రోడ్డు పక్కన పడేస్తున్నారు. రోడ్డుపై చెత్త పారవేస్తే ఫైన్ వేస్తామన్న జీవీఎంసీ కమిషనర్ హెచ్చరికలను సైతం స్థానికులు పట్టించుకోవడం లేదు. చెత్తను తెచ్చి దర్జాగా రోడ్డు పక్కన పడేస్తున్నారు. దీంతో పరిసరాలు వ్యర్థాలతో నిండి దుర్గంధంగా తయారవుతున్నాయి. కుళ్లిన ఆహార పదార్థాలు పారవేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ దుర్వాసన భరించలేక ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కుళ్లిన ఆహారాలు ఆవులు మేస్తున్నాయి. చెడిపోయిన ఆహారం తీసుకోవడం వలన మూగజీవాలు అనారోగ్యం బారిన పడే అవకాశాలున్నాయి. పారిశుధ్య కార్మికులు పేరుకు పోయినచెత్తను తొలిగించడం లేదు. డంపర్‌బిన్లలో నిండిన చెత్తను తరలించే వాహనాలు కూడా రాకపోవడంతో గత పది రోజులుగా రోజులుగా రోడ్డు పక్కన చెత్తకుప్పలు పేరుకుపోయాయి. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.



శివాజీపార్క్ రోడ్డు నర్సరీ వద్ద రోడ్డు పక్కన ఉన్న చెత్తను తింటున్న పశువులు

దుర్గంధంతో భక్తుల ఇబ్బంది..

అలాగే మద్దిలపాలెం ఉమామహేశ్వర ఆలయం పక్కన గెడ్డలో పూడికలు పేరుకుపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. చెత్త చెదారాలతో గెడ్డ నిండిపోవడంతో మురుగునీరు ప్రవహించే అవకాశం లేక నిలిచిపోయింది. ఫలితంగా భక్తులు దుర్వాసనతో సహజీవనం చేస్తున్నారు. కార్తీక మాసం కావడంతో ఉమామహేశ్వరుని ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. కాగా ఆలయం పక్కనే దుర్వాసన వెదజల్లుతూ గెడ్డ ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు సైతం గెడ్డ నుంచే దుర్వాసన భరించలేకపోతున్నారు. రోజుల తరబడి గెడ్డలో పూడికలు తొలగించడం లేదని స్థానికులు చెబుతున్నారు. చేసేది లేక కంపు భరిస్తూ ఉన్నామని వాపోతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి పూడికలు తొలగించాలని కోరుతున్నారు.

వేడుకగా శ్రీప్రకాశ్ కిడ్స్ డే



ఆటపాటలతో చిన్నారుల అభినయం

సిరిపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శ్రీప్రకాశ్ విద్యానికేతన్ చిన్నారుల కిడ్స్ డే సంబరాలు శనివారం వేడుకగా నిర్వహించారు. వివిధ వేషధారణలతో వేదికపై చిన్నారులు చేసిన నృత్యాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంస్కృతీసంప్రదాయాలు భావితరం పిల్లలకు తెలియజేసేందుకే ఇలాంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసుప్రకాశ్ పేర్కొన్నారు. వేడుకలో పాల్గొన్న పలువురు అతిథులను ఆయన సన్మానించారు. కిండర్ గార్డెన్‌లో యూకేజీ ముగించుకున్న చిన్నారులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా స్నాతకోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శనకు ప్రత్యేక ప్రదర్శనగా ఉంచారు. వీటిని విద్యార్థులతో పాటు, తల్లిదండ్రులు, అతిథులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో డాక్టర్ అనూరాధ, డాక్టర్ పెదవీర్రాజు, గీతా రామానుజన్, వంకాయల సన్యాసిరాజు తదితరులు మాట్లాడారు.

'సేవా కార్యక్రమాలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు'

ఆరిలోవ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచి సేవా కార్యక్రమాలు విద్యార్థులు అలవరచుకోవడం ద్వారా నాయకత్వ లక్షణాలు, సేవా భావం అలవడుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు పేర్కొన్నారు. శనివారం ఉదయం తోటగరువులో గల ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సేవా శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాభావం విద్యార్థులకు అవసరమన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ మూర్తి నూకల మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సుమారు ఏడు రోజుల పాటు ఈ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి వినోద్‌కుమార్, 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ సమస్యలపై పీఎఫ్ కమిషనర్‌కు వినతి

తగరపువలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు కార్మిక పింఛన్‌దారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ అవినాష్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈమేరకు వారు నగరంలోని పీఎఫ్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిశారు. మిల్లు యాజమాన్యం ఆరేళ్లుగా కార్మిక పింఛన్‌దారులకు 10బి ఫారం ఇవ్వడం లేదని, అక్కడ అడగడానికి కూడా ఎవరూ అందుబాటులో లేరని కార్మిక పింఛన్‌దారుల సంఘం కార్యదర్శి ఎస్కే హుస్సేన్, చిట్టివలస సంఘం కార్యదర్శి డి. బాబాజీ, సహాయ కార్యదర్శి ఎం.అప్పలరాజు తెలిపారు.

పింఛన్‌దారుల వివరాలను ఆన్‌లైన్‌లో పంపించాల్సి ఉండగా, మిల్లు మూతపడడం వల్ల పంపడం లేదని చెప్పారు.

సినిమా గైడ్

- **ది గర్ల్ ఫ్రెండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **జటాధర** : శారదా, శ్రీకన్య
- **బ్యాడ్ ల్యాండ్స్ / ఫెనిక్స్** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : వెంకటేశ్వర-1.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 26, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 66, బెండకాయలు 48, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 50, బీరకాయలు 60, ఆనపకాయ 38, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 24, క్యారెట్ 58, దొండకాయలు 42, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 64, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

కన్నుల పండువగా ముగిసిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వడ్డిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

వెంకోజిపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాత వెంకోజిపాలెంలోని శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న శ్రీగౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు శనివారం కన్నుల పండువగా ముగిశాయి. భక్తులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సారె పూజలో భక్తులు తీసుకొచ్చిన మిఠాయిలను అన్నదాన కార్యక్రమంలో వినియోగించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గవర కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు మళ్ల రవికుమార్, తదితరులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ అమ్మవారి ఊరేగింపు పురవీధుల్లో వైభవంగా సాగింది. మహిళలు తలపై ఉత్సవ విగ్రహాలను మోస్తూ వీధుల్లో ఊరేగించారు. తప్పెటగుళ్ళ, కోలాటం, సాముగరిడీ తదితర జానపద కళారూపాలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, జనసేన నాయకులు పీల వెంకటపరదేశినాయుడు, సంఘం గౌరవాధ్యక్షుడు మళ్ల పోలిరాజు, అధ్యక్షుడు కర్రి వెంకట సూరి అప్పారావు, ఇతర కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవం వేదిక మార్పు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి, దీపోత్సవ కమిటీ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం విశాఖలో ఈ నెల పదిన ఏర్పాటు చేసిన శ్రీమహాలక్ష్మి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కార్తీక దీపోత్సవం వేదికను మార్చినట్టు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు. వచ్చే సోమవారం సాయంత్రం రుషికొండలోని వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్వహించాలని తొలుత నిర్ణయించినప్పటికీ భక్తుల రద్దీ, వారికి కల్పించాల్సిన సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని వేదికను వుడా పార్కు సమీపంలోని ఎంజీఎం పార్కులోకి మార్చినట్టు తెలిపారు. దీపోత్సవానికి టోకెన్ కలిగిన భక్తులను మాత్రమే అనుమతిస్తారని, ఇతరులకు అనుమతించరని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎమ్మెల్యేను కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధులు శనివారం ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశారు.

రోలర్ స్కేటింగ్‌లో మూడు స్వర్ణ పతకాలు

- డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థిని విద్యాప్రజాపతి ప్రతిభ



స్వర్ణ పతకాలతో విద్యాప్రజాపతి

మద్దిలపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థిని విద్యాప్రజాపతి రోలర్ స్కేటింగ్‌లో మూడు బంగారు పతకాలు గెలుచుకొంది. ఇటీవల కాకినాడలో నిర్వహించిన అంతర్ రాష్ట్రీయ (ఇంటర్ స్టేట్) రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మూడు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. రింక్ 2 (500+డి), రింక్ 3 (వెయ్యి మీటర్లు),రోలర్ రోడ్డు-2 (3 వేల మీటర్లు) విభాగాల్లో బంగారు పతకాలు సాధించి, వచ్చే నెల విశాఖలో నిర్వహించే జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత, అధ్యాపకులు వేదవ్యాస్, ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావులు విద్యార్థిని విద్యాప్రజాపతికి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మరిన్ని విజయాలు సాధించాలని, జాతీయస్థాయిలో కూడా విజయం సాధించి రాష్ట్రానికి, కళాశాలకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సత్యసాయి మహిళా విభాగం సేవ



బీచ్‌రోడ్డులో విగ్రహాలను శుభ్రం చేస్తున్న సత్యసాయి సేవా సమితి మహిళా విభాగం

ఎంవీపీ కాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా శ్రీసత్యసాయి మహిళా యువత విభాగం ఆధ్వర్యంలో శనివారం నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీచ్ రోడ్డులోని విగ్రహాలను శుభ్రం చేయడంతో పాటు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా శత వార్షిక జన్మదినోత్సవంలో భాగంగా బీచ్ రోడ్డులోని మహనీయుల విగ్రహాలను పరిశుభ్రపరిచారు. వంద ఆటోలపై 'నిదానమే ప్రధానం', 'తొందరగా బయలుదేరు.. నెమ్మదిగా వెళ్లు.. భద్రంగా చేరుకో' తదితర నినాదాలతో కూడిన స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు నాయుడు, కన్వీనర్ సాయికుమార్, సమన్వయకర్త సోమేశ్వరి, యూత్ కన్వీనర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వద్దంటూ సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న వైసీపీ నేతలు

అక్కయ్యపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించరాదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. వైసీపీ ఆధ్వర్యంలో శనివారం నరసింహనగర్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ పరిసర ప్రాంతాలకు చెందిన వారి నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే ఫీజులు పెరిగిపోతాయని, తద్వారా పేద విద్యార్థులకు విద్య దూరమవుతుందన్నారు. అందుకోసం ప్రైవేటు వ్యక్తులకు మెడికల్ కాలేజీలను అప్పగించరాదన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆస్పత్రికి రూ.1.5 లక్షల విరాళం



ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావుకు చెక్ అందజేస్తున్న నరసింహారావు

సీతమ్మధార, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధారలో లయన్స్ కాన్సర్, జనరల్ ఆస్పత్రిని సందర్శించిన జిల్లా విశ్రాంత న్యాయమూర్తి సలాది నరసింహారావు తన తండ్రి సలాది గంగరాజు జ్ఞాపకార్థం ఆస్పత్రుల్లో అల్ట్రా సౌండ్, కలర్ డాప్లర్ గది ఆధునికరణ నిమిత్తం రూ.1,50,000 చెక్కును విరాళంగా అందచేశారు. ఈ చెక్కును లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావుకు అందచేశారు. ఈ సందర్భంగా సలాది నరసింహారావును ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ అభినందించింది.

నత్తనడకన సచివాలయ భవన నిర్మాణం

- ఏడాదిన్నర గడచినా.. పూర్తి కాని అంబేడ్కర్ కాలనీలోని భవనం
- కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం



అంబేడ్కర్ కాలనీలో ఏడాదిన్నర నుంచి నిర్మాణలలోనే ఉన్న సచివాలయ భవనం

మాధవధార, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర నియోజకవర్గంలోని వార్డు సచివాలయాలకు సరైన వసతి కరువైంది. ప్రత్యేకించి మాధవధార, మురళీనగర్, బర్మా క్యాంప్, ఎన్‌జీజీవోస్ కాలనీ ప్రాంతాల్లో ఆదరా బాదరాగా కల్యాణ మండపాలు, సామాజిక భవనాలు, పూర్వ మీసేవ కార్యాలయాలను సచివాలయాల కోసం తొలినాళ్లలో కేటాయించారు. మురళీనగర్‌లో కొన్ని సచివాలయాలను నేటికీ అద్దె భవనాల్లోనే నడిపిస్తున్నారు. అప్పటివరకు ఉన్న అంగన్‌వాడీ భవనంలో సగ భాగం తీసుకొని సత్యానగర్‌లో ఓ సచివాలయం పెట్టారు. కొత్త భవనం నిర్మించి సత్యానగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని కొద్ది నెలల క్రితమే అందులోకి తరలించారు. దాదాపు ఏడాదిన్నర క్రితమే వైసీపీ సర్కారు హయాంలోనే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ సచివాలయం పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. కేవలం 40 గజాల స్థలంలో ఒక అంతస్తుగా భవనం కట్టడానికి రూ.16 లక్షలు మంజూరు చేశారు. ఆ తర్వాత అంబేడ్కర్ కాలనీ రోడ్డు విస్తరణ, 80 అడుగుల రోడ్డు ప్రతిపాదన రావడంతో కొన్ని నెలలు మీమాంసలో నిలిపివేశారు. వెరసి 40 గజాల జాగాలో ఒక స్లాబు వేసి రెండు గదులు కట్టడానికి ఏడాదిన్నర పూర్తవుతున్నా, పనులు కొలిక్కి రాలేదు! ప్రస్తుతం ముగింపు పనుల పేరిట మరో రూ.5 లక్షల కోసం ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారుల అనుమతికి దస్త్రం పంపినటేకట ఏఈ సాయినాథ్ తెలిపారు. అంటే..ఒక్క అంతస్తు కట్టడానికి మొత్తంగా జీవీఎంసీ చేస్తున్న ఖర్చు రూ.21 లక్షల పైమాటే. పనులు పూర్తి చేయడానికి కాంట్రాక్టరు, జీవీఎంసీ అధికారులు నిర్ణీత గడువు లేకుండా నత్తను తలపిస్తున్నారు. పూర్వ మీసేవ భవనంలో కొనసాగిన 286, 289 సచివాలయాల్ని జోనల్ కార్యాలయం ఏర్పాటవుతుండడంతో ఇటీవల మరో రెండు సచివాలయాల్లో తాత్కాలికంగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా భవన నిర్మాణం తొందరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విశాఖ, నౌపడ, పర్లాకిమిడి సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా,పాల్గొన్న రైల్వేఅధికారులు

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు డివిజన్ పరిధిలోని విశాఖ, నౌపడ, పర్లాకిమిడి సెక్షన్‌లో డీఆర్ఎం లలిత్ బోహ్రా శనివారం పర్యటించి తనిఖీలు చేశారు. స్టేషన్లలో ప్రయాణికుల మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్లాట్‌ఫామ్‌ల పెంపు, అప్‌గ్రేడ్ చేసిన తాగునీరు సౌకర్యం, ప్లాట్‌ఫామ్‌లపై షెల్టర్లు ఏర్పాటు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, దివ్యాంగులకు ప్రత్యేక చర్యలు వంటి వాటిపై దృష్టి సారించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సౌకర్యాల నిర్వహణను పరిశీలించి, ఏర్పాటు చేయాల్సిన సదుపాయాలపై అధికారులతో చర్చించారు. ఇక విజయనగరం, పర్లాకిమిడి, దూసి స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్టేషన్ల ఆధునీకరణలో సుందరీకరణకు ప్రాధాన్యమివ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. విండో ట్రైలింగ్ ద్వారా సెక్షన్‌లోని వంతెనలు, క్రాసింగ్‌లు, స్టేషన్ యార్డులు వంటి వాటిని పరిశీలించారు. ఈ పర్యటనలో సీనియర్ డీఈ (ఈస్ట్) బి.సాయిరాజ్, సీనియర్ డీవోఎం అవినాష్, సీనియర్ డీసీఎం పవన్‌కుమార్, సీనియర్ డీఈఈ ఎంఎస్ఎన్.మూర్తి ఉన్నారు.

రిటైర్డ్ ఏడీసీపీ మహమ్మద్‌ఖాన్‌కు సత్కారం



మహమ్మద్‌ఖాన్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మురళీనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వెటరన్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపిన పోలీసు శాఖ రిటైర్డ్ ఏడీసీపీ మహమ్మద్ ఖాన్‌ను శనివారం మురళీనగర్‌లోని వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం (వావ్) సభ్యులు సత్కరించారు. అధ్యక్షుడు ఎం.వరప్రసాద్, పీఆర్వో సీహెచ్ వంశీ తదితరులు శాలువా కప్పి సత్కరించారు. ఇటీవల నిర్వహించిన జిల్లా పోటీల్లో రిటైర్డ్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ మహమ్మద్‌ఖాన్ 100 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణం, జావెలిన్ త్రో పోటీల్లో రజత పతకాల్ని గెలుపొందినట్లు వావ్ అధ్యక్షుడు ఎం.వరప్రసాద్ తెలిపారు. డిసెంబరు 13, 14 తేదీల్లో గుంటూరులో జరిగే 45వ ఏపీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలకు కూడా అర్హత సాధించినట్టు తెలియజేశారు. నగర పోలీస్ కమీషనరు శంఖబ్రత బాగ్చీ నుంచి కూడా ప్రశంసలందుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కమల్ బయిద్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సీపీఆర్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అక్కయ్యపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ కంపుల్స్, అపోలో హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు చెప్పించుట ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యారాలు జయంతి రాధా కుమారి, ఎన్‌సీసీ అధికారి ఎంఎస్‌వీ విశ్వనాథం, ఉపాధ్యాయురాలు గ్లోరీ, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల రాంప్రసాద్, షాహిదా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు

మురళీనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) ; జీవీఎంసీ 49వ వార్డు బర్మాక్యాంప్ ఏఎస్సార్‌నగర్‌లో జైలాల్ అల్లూరి శ్రీగౌరీసేవాసంఘం ఆధ్వర్యంలో అక్టోబరు 30 నుంచి నిర్వహించిన గౌరీ పరమేశ్వరుల నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. సాయంత్రం మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం గ్రామంలో శివపార్వతుల ఊరేగింపు నిర్వహించి సాగర నిమజ్జనానికి తరలించారు. సంఘం అధ్యక్షుడు కె.శివఅప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎ.పాపారావు తదితరులు ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లు చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాల మధ్య కోలాహలంగా సాగిన నిమజ్జన ఊరేగింపులో బర్మా క్యాంప్, ఏఎస్సార్ నగర్, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల నుంచి స్థానికులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను జయించి...

... 5వ పేజీ తరువాయి

కొందరు స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్లారు. దానిని కొనసాగిస్తూ వచ్చారు. ఈ క్రమంలో పూణెకు చెందిన గిరి ప్రేమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరో ఐదుగురు మహిళలతో కలిసి గత నెల మూడో తేదీన ఎవరెస్ట్ పర్వతారోహణకు వెళ్లారు. 12వ తేదీ నాటికి బేస్ క్యాంపునకు చేరుకుని తిరిగి 17వ తేదీ నాటికి వెనక్కి వచ్చారు. మహిళలు చిన్నచిన్న సమస్యలకు కుంగిపోకుండా ధైర్యంగా ఉండాలని, ఆత్మస్థైర్యంతో ముందుకుసాగితే విజయాలను సాధించగలమని మున్నీ పేర్కొన్నారు.

మెగాసిటీగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

ప్లాన్ చేస్తున్నారు. అదేవిధంగా విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్‌లో పర్యాటక ప్రాజెక్టులు అనేకం వస్తున్నాయి. విశాఖ నుంచి ఆనందపురం మీదుగా అనేక పేరొందిన విద్యా సంస్థలు ఐఐఎం, అనిట్స్, గాయత్రి, అవంతి, రఘు ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ఇవన్నీ ఈ మెగాసిటీకి గ్రోత్ ఇంజన్లుగా ఉపకరిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

డీపీఆర్ తయారుచేస్తాం

ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

రాంబిల్లి నుంచి భోగాపురం వరకు సెమీ రింగ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన అధ్యయనం కోసం కన్సల్టెంట్‌ను నియమించాం. ఆ మార్గం ఎలా ఉండాలి?, ఎటువైపు తీసుకువెళ్లాలి?...అనే అంశాలపై నివేదిక వస్తుంది. దాని ప్రకారం డీపీఆర్ తయారుచేస్తాం. ఇది త్వరగానే కార్యరూపంలోకి వస్తుంది.

25 ఏళ్లలో శ్రీకాకుళం కూడా కలుస్తుంది

పీవీఎన్ మాధవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వం అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం ఒక స్ట్రిప్ కింద అభివృద్ధి చేయాలని భావిస్తోంది. అందులో భాగంగానే సెమీ రింగ్ రోడ్డు ప్రతిపాదించారు. ఇది ఎంతవరకు ఉపయోగపడుతుందనే దానిపై చర్చలు జరుగుతున్నాయి. రాబోయే 25 ఏళ్లలో శ్రీకాకుళం కూడా వీటితో కలిసిపోనుంది.

పెరిగిన కూరగాయల ధరలు

... 5వ పేజీ తరువాయి

చిన్నదైతే రూ.20, పెద్దదైతే రూ.30కి దొరికేది. ఇప్పుడు వాటిని రూ.40 కంటే తక్కువకు ఇవ్వడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో బీర, బెండ, దొండ, ఆనప పండిస్తున్నారు. వీటిని రైతులు పది రూపాయలు అటుఇటుగా అమ్మేసి త్వరగా ఇంటికి వెళ్లిపోతున్నారు. ఇతర జిల్లాల నుంచి హోల్‌సేల్ వ్యాపారులు తెప్పిస్తున్న బీన్స్ రకాలు, క్యారెట్, బీట్‌రూట్ తదితరాల ధరలు అధికంగానే ఉన్నాయి. ఇది కార్తీకమాసం, అయ్యప్ప స్వాముల దీక్షలు ప్రారంభం కావడంతో అత్యధికులు శాకాహారమే తీసుకుంటున్నారు. దాంతో కూరగాయల వినియోగం బాగా పెరిగింది. రేటు ఎక్కువ పెట్టినా తప్పనిసరిగా కొంటారనే ధీమా ఉండడంతో హోల్‌సేల్ వ్యాపారులు డిమాండ్‌కు సరిపడా సరకులు తెప్పించకుండా కొంచెం తక్కువ రప్పిస్తూ కృత్రిమ డిమాండ్ సృష్టించి అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. దీనిపై వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు దృష్టి పెడితే సరకుల లభ్యత పెరిగి ధరలు తగ్గుతాయి.

రక్తమోడుతున్న రోడ్లు

... 5వ పేజీ తరువాయి

క్షతగాత్రులయ్యారు. గత వారం రోజుల్లోనే రోడ్డు ప్రమాదాల కారణంగా సుమారు 15 మంది వరకు మృత్యువాతపడ్డారు. గత మూడేళ్లుగా రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుతూ వచ్చినప్పటికీ ఈ ఏడాది ప్రమాదాల సంఖ్యతోపాటు మరణాల సంఖ్య కూడా పెరిగేలా ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

సీపీ దృష్టిసారించకపోతే మరింత పెరిగే అవకాశం

పెండింగ్ చలాన్‌ల వసూళ్లపై కాకుండా వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టిపెట్టాల్సిందిగా సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీచేయాల్సిన అవసరం ఉంది. అలాగే కొందరు సిబ్బంది విధి నిర్వహణను పక్కనపెట్టి చెట్ల కింద కుర్చీలో కూర్చొని సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై కనిపించకపోవడంతో ఇష్టారాజ్యంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అదే ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై ఉంటే వాహన చోదకులు నిబంధనలను పాటిస్తారు కాబట్టి ప్రమాదాలకు ఆస్కారం తగ్గుతుంది. రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడంపై సీపీ దృష్టిసారించాలని నగరవాసులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు తీవ్ర పోటీ

... 5వ పేజీ తరువాయి

పోస్టులను మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేస్తారని, సిఫారసులను పరిగణనలోకి తీసుకోరని చెబుతున్నా అభ్యర్థులు వినిపించుకోవడం లేదు. 'మీరు లెటర్ ఇస్తే చాలు సర్. మిగిలిన పని మేము చూసుకుంటాం' అంటున్నారు. దీంతో పలువురు ఎమ్మెల్యేలు తప్పనిసరి పరిస్థితుల్లో లేఖలు ఇస్తున్నారు. ఇప్పటివరకూ సిఫారసు లేఖలతో 20 మంది వరకూ ఐసీడీఎస్ కార్యాలయానికి వచ్చినట్టు చెబుతున్నారు. మరికొందరు కార్యాలయ అధికారులకు స్థానిక ప్రజా ప్రతినిధులతో ఫోన్లు చేయిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మన వాళ్లకు వచ్చేలా చూడండని కొందరు నేతలు చెబుతున్నట్టు తెలుస్తోంది.

భారీగా దరఖాస్తులు..

భీమునిపట్నం ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఐదు కార్యకర్తల పోస్టులకు 32 మంది దరఖాస్తు చేశారు. అలాగే, విశాఖ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న రెండు కార్యకర్తల పోస్టులకు మరో 32 మంది అభ్యర్థులు దరఖాస్తులు వచ్చాయి. అలాగే, భీమునిపట్నం ప్రాజెక్టు పరిధిలో 11, పెందుర్తి ప్రాజెక్టు పరిధిలో 21, విశాఖ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో 21 హెల్పర్ పోస్టులకు 193 మంది దరఖాస్తుచేశారు. ఆయా దరఖాస్తులను ప్రస్తుతం అధికారులు స్క్రూటీనీ చేస్తున్నారు. అయితే, దరఖాస్తు చేసిన వారిలో దాదాపు ప్రతి ఒక్కరూ రాజకీయంగా పలుకబడిని ఉపయోగిస్తుండడంతో అధికారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయిన తరువాత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించి నియామక పత్రాలు అందిస్తామని చెబుతున్నారు.

సబ్ ట్రెజరీ కుంభకోణంలో అధికారులపై చర్యకు మీనమేషాలు!

... 5వ పేజీ తరువాయి

36 మంది పాత్ర ఉన్నట్టు నిర్ధారించింది. అందులో ఇప్పటివరకూ నలుగురు చనిపోగా, 32 మంది ఉన్నారు. వారిలో కొందరు రిటైరయ్యారు. ఇంకా సర్వీస్‌లో 11 మంది సీనియర్ అకౌంటెంట్లు, మరికొందరు ఉప, సహాయ ఖజానా అధికారులు ఉన్నారు. సీనియర్ అకౌంటెంట్లకు జిల్లా స్థాయిలో డిప్యూటీ డైరెక్టర్ హోదా కలిగిన జిల్లా ఖజానా అధికారి మోహనరావు చార్జిమెమోలు ఇచ్చారు. అధికారులు మాత్రం విజయవాడలోని ఖజానా శాఖ డైరెక్టరేట్ పరిధిలోకి వస్తారు. అధికారులకు చార్జిమెమోలు జారీ చేయకుండా ఒత్తిళ్లు వస్తున్నాయని చెబుతున్నారు. కుంభకోణం వెలుగులోకి వచ్చిన తరువాత ఒకపక్క విచారణ జరుగుతుండగానే కొందరు సీనియర్ అకౌంటెంట్లకు ఉప ఖజానా అధికారులుగా, ఉప ఖజానా అధికారులకు సహాయ ఖజానా అధికారులుగా పదోన్నతులు కల్పించారు. నిబంధనల ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వకూడదు. కానీ సొమ్ములు తీసుకుని పదోన్నతులు ఇచ్చినట్టు చెబుతున్నారు. దోషులుగా విజిలెన్స్ గుర్తించిన అధికారులపై ఉన్నత స్థాయిలో ఒత్తిళ్ల కారణంగా ఇప్పుడు చర్యలకు వెనకడుగు వేస్తున్నారనే చర్చ ఖజానా శాఖలో జరుగుతోంది. ఏపీ ఉద్యోగుల సర్వీస్ రూల్స్ ప్రకారం ఒక ఉద్యోగి/అధికారి పదవీ విరమణ చేసి నాలుగుళ్ల దాటితే...అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకూడదు. సబ్‌ట్రెజరీ కుంభకోణంలో పాత్రధారులుగా తేలిన వారిలో పదవీ విరమణ చేసి నాలుగేళ్లు పూర్తికాని వారున్నారు. అందుకు కొద్దినెలలు మాత్రమే సమయం ఉన్నవారున్నారు. అటువంటి వారంతా చార్జిమెమోలు ఇవ్వకుండా చూసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. నాలుగేళ్లు పూర్తయిన తరువాత మెమోలు ఇచ్చినా సర్వీస్ రూల్స్ మేరకు చెల్లవని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక బహిర్గతం చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు. నివేదికలో పేర్కొన్న ప్రతి ఉద్యోగి/అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

- దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



బాధితురాలికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో 31వ వార్డుకు చెందిన సింగంపల్లి పద్మకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.1,07,233 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో వైద్యం చేయించుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడే పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప వరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'కేజీహెచ్‌పై తప్పుడు ప్రచారం తగదు'

మహారాణిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌పై తప్పుడు ప్రచారం చేస్తే వైసీపీ నాయకులకు రాజకీయ భవిష్యత్తు ఉండదని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేజీహెచ్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి రోగులు ఇబ్బందులు పడ్డారని వైసీపీ నాయకులు ఆరోపించడం సరికాదన్నారు. ఆస్పత్రిలో నీటి సరఫరా పైపులైన్ పనుల కోసం జరిపిన తవ్వకాల వల్ల జేసీబీ బకెట్ తగిలి విద్యుత్ కేబుల్ లైన్లు తెగిపోయాయని, దీనివల్ల మధ్యాహ్నం 2 నుంచి సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించారన్నారు. రోగులకు ఇబ్బంది కలగకుండా ఐదు జనరేటర్లతో సరఫరా అందించారని తెలిపారు. ఇవేవీ తెలియకుండా వైసీపీ నాయకులు ఇష్టారీతిన మాట్లాడడం సరికాదన్నారు. అసత్య ప్రచారాలు చేస్తే వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి 11 సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు.

వందేమాతరం గేయాలాపన

మహారాణిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లోని స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం వందేమాతరం గేయాలాపన సామూహికంగా నిర్వహించారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా వన్‌టౌన్‌లోని స్వర్ణకారుల సంఘం, విశ్వబ్రాహ్మణుల సంఘం, వీర బ్రహ్మేంద్రస్వామి ఆధ్యాత్మిక పూజా మందిరం కార్పెంటర్ల సంఘం, ఇతర సంఘాల ఆధ్వర్యంలో గేయాలాపన జరిపారు. ఈ సందర్భంగా 38వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గోడి నరసింహాచారి వందేమాతరం గేయం విశిష్టతను తెలియజేశారు.

నేడు కుసుమ, హరనాథుల కల్యాణం

డాబాగార్డెన్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్‌నగర్‌లోని కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకుసుమ, హరనాథుల లీలా కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆశ్రమ అధ్యక్ష, కార్యదర్శులు బీబీ బాబాజీ,ఆర్‌వీఎస్ రమేశ్ తెలిపారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవానికి వ్యాఖ్యాతగా ఆధ్యాత్మిక వేత్త రాజశేఖర్ వ్యవహరిస్తున్నారని చెప్పారు.

రాజ్యాంగ దినోత్సవం వేడుకలకు జీవీఎంసీ విద్యార్థి రాజేశ్

డాబాగార్డెన్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో ఈనెల 26న జరిగే రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొనేందుకు డాబాగార్డెన్స్‌లోని జీవీఎంసీ మహాత్మాగాంధీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాకేశ్ పాత్రో ఎంపికయ్యాడు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోటీ పరీక్షల ద్వారా ఒక్కొక్క విద్యార్థిని ఎంపిక చేసి, రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. తమ పాఠశాల నుంచి రాకేశ్ ఎంపికైనట్టు పాఠశాలహెచ్ఎం ఆర్‌వీఎస్ నాగభూషణం తెలిపారు.



భీమ్‌నగర్ డిస్పెన్సరీ ఎదురుగా రోడ్డు దుస్థితి



కృష్ణాగార్డెన్స్ నుంచి అంబేడ్కర్ జంక్షన్‌కు తిరిగే మలుపులో పాడైన రహదారి

అధ్వాన రహదారులతో అవస్థలు

- అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఎల్ఐసీ, భీమ్‌నగర్, వివేకానంద్ వరకు గోతులమయమైన రోడ్లు
- ఏళ్ల తరబడి మరమ్మతులు కరువు
- రాకపోకలకు వాహనదారుల తీవ్ర ఇబ్బందులు

డాబాగార్డెన్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి భీమ్‌నగర్, కృష్ణా గార్డెన్స్, వివేకానంద సర్కిల్ వరకు ఉన్న రహదారులు గోతులతో అధ్వానంగా ఉన్నాయి. ఈ రోడ్లలో ప్రయాణించాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఒకవైపు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నటికీ నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ రహదారులను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. నగరంలోకి వివిధ ప్రాంతాలు, జిల్లాల నుంచి వచ్చేవారు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు, రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ఈ రోడ్లను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇటీవల ఈ రోడ్లు పూర్తిగా గోతులు పడ్డాయి. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ఒక వాహనం వెనుక మరో వాహనం వచ్చినప్పుడు గోతుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి రహదారులో గోతుల పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రెండు సార్లు పడిపోయాను

- ఎం.విక్రమ్ వాహనదారుడు



భీమ్‌నగర్ నుంచి ఎల్ఐసీ రోడ్డుకు వచ్చే మార్గంలో రెండు సార్లు పడిపోయాను. రాత్రి వేళలో మినిమమ్ స్పీడ్‌లో వెళ్లినప్పటికీ గోతులవల్ల ప్రమాదాలకు గురవుతున్నాం. అధికారులు తక్షణమే గోతులు పూడ్చాలి.

త్వరలోనే మరమ్మతులు చేస్తాం

జోన్ 4 కమిషనర్ మల్లయ్యానాయుడు



డాబాగార్డెన్స్ అంబేడ్కర్ సర్కిల్ నుంచి భీమ్‌నగర్ మీదుగా వివేకానంద విగ్రహం వరకు రహదారుల మరమ్మతుకు త్వరలోనే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రోడ్ల మరమ్మతుకు నిధులు కూడా మంజూరయ్యాయి. వేగంగా పనులు చేపట్టి వాహనదారుల ఇబ్బందులు తొలగిస్తాం.

వాట్సాప్ ద్వారా కనకమహాలక్ష్మి అమ్మవారి సేవల బుకింగ్

మహారాణిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహించే మార్గశిర మాసోత్సవాల్లో సేవలను వాట్సాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చునని అధికారులు ప్రకటించారు. ఈనెల 21 నుంచి డిసెంబరు 19 వరకు నిర్వహించనున్న ఉత్సవాల సందర్భంగా గురువారం జరిగే పంచామృతాభిషేకానికి రూ.10 వేలు, మిగిలిన రోజుల్లో రూ. 3 వేలుగా నిర్ణయించారు. విశిష్ట దర్శనం టికెట్లు రూ.500 ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 నెంబరు ద్వారా బుక్ చేసుకోవచ్చునని సూచించారు.

భక్తులతో సింహగిరి కిటకిట



ఆలయం లోపల భక్తుల రద్దీ

సింహాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు. కార్తీక మాసం రెండో శనివారం కావడంతో పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఒడిశా నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సింహగిరి కిటకిటలాడింది.సూర్యోదయానికి ముందే భక్తులు పుష్కరిణిలో, సింహగిరి మెట్ల మార్గంలోని జలధారల్లో పుణ్యస్నానాలు ఆచరించి, దీపారాధనలు చేశారు. తొలుత భైరవస్వామిని, కొండదిగువ స్వామివారి పూతోటలోని వేంకటేశ్వరస్వామిని, అప్పన్న సహోదరి అడివివరం గ్రామ దేవత పైడితల్లమ్మను దర్శించుకున్నారు. అనంతరం సింహాద్రినాథుడ్ని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.భక్తుల తాకిడితో అప్పన్న ఖజానాకు శనివారం ఒక్కరోజే రూ.44.56 లక్షల ఆదాయం సమకూరింది.

వాహనాల పార్కింగ్‌కు అవస్థలు

సింహగిరికి వస్తున్న భక్తులు వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో శనివారం తప్ప ఇతర రోజుల్లో పెద్దగా రద్దీ ఉండేది కాదు. గత మూడేళ్లుగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో సింహగిరిపై, కొండదిగువ వాహనాల పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పీఆర్‌ఓ కార్యాలయం ఎదురుగా, గజపతి సత్రం పరిసరాల్లో కార్లు, స్కూటర్లు పార్కింగ్ చేస్తున్నప్పటికీ కొన్ని వాహనాలకు స్థలం ఉండడం లేదు. అలాగే కొండదిగువన భక్తులను తీసుకువచ్చే ఆటోలు, ట్యాక్సీలు పార్కింగ్ ప్రాంతం లేక బస్సులు తిరిగే దేవస్థానం బస్టాండ్‌లో పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల కొన్నిసార్లు ఆర్టీసీ, దేవస్థానం బస్సులు రాకపోకలకు అవస్థలు పడాల్సి వస్తోంది.


ఎక్స్‌కవేటర్‌తో పూడిక తొలగిస్తున్న దృశ్యం

గెడ్డల్లో పూడికల తొలగింపు

అగనంపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి నుంచి స్టీల్‌ప్లాంటుకు వెళ్లే ప్రధాన రహదారిలో చెక్‌పోస్ట్, నడకమ్మెదానం వద్ద ఉన్న ప్రధాన గెడ్డల్లో పూడిక తీత పనులకు జీవీఎంసీ శనివారం శ్రీకారం చుట్టింది. మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు స్థానిక ప్రధాన గెడ్డలు పూడికలతో నిండిపోయాయి. దీంతో కాలువలోని నీరు సజావుగా ప్రవహించకపోవడంతో స్థానికులు ఈ విషయాన్ని కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి పూడిక తీత చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మూడవ శనివారం సందర్భంగా షీలానగర్‌లోని బాలాజీ దివ్యక్షేత్రం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు పాల్గొన్నారు.

ప్రసన్నగిరిపై సంకటహర చతుర్దశి

కార్తీకమాస సంకటహర చతుర్దశి సందర్భంగా బీహెచ్‌పీవీపీ ప్రసన్నగిరిపై ఉన్న వెంకటేశ్వర వినాయక దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదానం

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో కొలువైన అయ్యప్పసస్వామివ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం విజయవంతంగా సాగుతోంది. రోజుకు సుమారు 1500 మంది భక్తులకు అన్నదానం చేస్తున్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో అయ్యప్ప మాదధారణ భక్తులు, భవానీలు, శివ మాలధారణ భక్తులు, ఇతరులు కూడా ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. ఈనెల 16న పడిపూజ నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ కార్యదర్శి కేఎస్ఎన్.రావు కోరారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో పసిడి పతకం

గాజువాక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జర్మనీలో అక్టోబరు 26 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు జరిగిన డబ్ల్యూకేయూ వరల్డ్ చాంపియన్‌షిప్ కరాటే పోటీల్లో గాజువాక ప్రాంతానికి చెందిన గున్నా శివాజీ 55సంవత్సరాల వయస్సు, 80కేజీల సీనియర్స్ (వెటరన్స్) విభాగంలో పసిడి పతకం సాధించారు. గ్రాండ్ మాస్టర్ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుని అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించామని శివాజీ తెలిపారు.

సినిమా గైడ్

- **ది గర్ల్ ఫ్రండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **జటాధర** : శారదా, శ్రీకన్య
- **బ్యాడ్ ల్యాండ్స్ / ఫెనిక్స్** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : వెంకటేశ్వర-1.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 26, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 66, బెండకాయలు 48, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 50, బీరకాయలు 60, ఆనపకాయ 38, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 24, క్యారెట్ 58, దొండకాయలు 42, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు(కిలో)70, అల్లం (పాతది) 64, బరబాటి48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోసకాయలు 40, వెల్లుల్లి(పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 46, దేముడుచిక్కుడు70, గోరుచిక్కుడు 42, కూరపెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50,కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60,బూడిదగుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

- పెదగంట్యాడ బీసీ రోడ్డు విస్తరణ శంకుస్థాపనలో ,గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సంపద సృష్టి, అభివృద్ధి, సంక్షేమాలను సమాంతరంగా ప్రభుత్వం ముందుకు తీసుకెళుతోందని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. రూ.15కోట్లు ఫైనాన్సు కమిషన్ నిధులతో బీసీరోడ్డు విస్తరణకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాల నుంచి విశాఖ ఎంతో ప్రగతి సాధించిందని, దానికి సమాంతరంగా గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాలు అభివృద్ధి చెందలేదన్నారు. జీవీఎంసీకి ఈ ప్రాంతం నుంచే అధిక అధాయం వచ్చినప్పటికీ, అభివృద్ధికి మాత్రం తగినన్ని నిధులు కేటాయించలేదన్నారు. 65 అడుగుల వెడల్పుతో ఉన్న బీసీ రోడ్డును 130 అడుగులకు విస్తరించడం ద్వారా ఈ ప్రాంతం స్వరూపమే మారనున్నదని అన్నారు. రోడ్డు పనులు ప్రారంభం కాకముందే అండర్‌గ్రౌండ్ పనులు ఉంటే చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్, యూజీడీ అధికారులకు సూచించారు. బీసీ రోడ్డు లోని మహాత్మాగాంధీ జంక్షన్ నుంచి గంగవరం వరకు రూ.8కోట్లతో రెండులైన్ల రోడ్డు, వంటిళ్ల జంక్షన్ నుంచి వై జంక్షన్ వరకు రూ. 8కోట్ల రోడ్డు విస్తరణ చేస్తామన్నారు. గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాల్లో ఉన్న క్రీడా మైదానాలు, పార్కులు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు విషయంలో ప్రజాభిప్రాయమే తన అభిప్రాయమన్నారు. ఈ విషయంలో స్థానికులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, డీసీసీబీ చైర్మన్ కోనతాతారావు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.


కూర్మన్నపాలెం: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా

సంక్షేమమే లక్ష్యంగా..

ఆటోనగర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ ముందుకు సాగుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఏపీ టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ భవనానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషనరీ, ఎక్విప్‌మెంట్ కొనుగోలుకు ప్రభుత్వం నుంచి రాయితీలు, అసోసియేషన్ సిబ్బందికి వైద్య, ఆరోగ్య సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షడు కరణం కనకారావు మాట్లాడుతూ దశాబ్ద కాలంగా వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పిస్తూ, ఆర్థిక ఇబ్బందులతో అభివృద్ధికి నోచుకోని ఏపీ టెక్నికల్ ఓనర్స్ అసోసియేషన్‌కు సొంత ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు స్థలం కేటాయించమని ఎమ్మెల్యే పల్లాను కోరామని తెలిపారు. 'ఎమ్మెల్యే పల్లా మాటల మనిషి కాదు. చేతల మనిషని మరోక సారి రుజువైంది' అని అన్నారు. ఈ సంరద్భంగా పల్లాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఏసీ డైరక్టర్ ప్రసాదుల శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

నేడు మెగా వైద్యశిబిరం

మల్కాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ కోరమాండల్ ఎరువుల కర్మాగార సంస్థ 58వ వార్డు గొందేశివాని పాలెంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కంపెనీ అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఉంటుందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు.

కార్మికులకు అండగా ఉంటాం

- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కూర్మన్నపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏడు నెలల నుంచి జీతాలు చెల్లించడం లేదని వీఎస్ఈజెడ్ దగ్గర సినర్జీస్ కార్మికులు చేస్తున్న ధర్నాలో శనివారం మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గాజువాక మీజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట రామయ్యా పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 7 నెలలుగా జీతాలు చెల్లించక పోతే కార్మికులు వాళ్ల కుటుంబాలను ఏం పెట్టి పోషించాలని ప్రశ్నించారు. బస్సు సౌకర్యాలను, పీఎఫ్‌లను కట్టకుండా కాలయాపన చేయడం, మౌలిక సదుపాయాల కల్పనపై శ్రద్ధ పెట్టకపోతే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల ఊరేగింపు

ఎన్ఏడీ.జంక్షన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్‌లో వారం రోజులుగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం వైభవంగా జరుగుతోంది. ఈ సందర్భంగా శనివారం 500 మందికి అన్నసమారాధ నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో పురవీధుల్లో గౌరీపరమేశ్వరుల ఊరేగింపు నిర్వహించారు.

పనులు త్వరగా పూర్తి చేయండి: కలెక్టర్


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మల్కాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ మారుతి సర్కిల్ వరకు జరుగుతున్న రహదారి విస్తరణ పనులను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ ఎన్‌హెచ్ విభాగాల అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా యాన మాట్లాడుతూ సాగరమాల ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ మార్గంలో ఐఎన్ఎస్ డేగా, పోర్టు, డాక్ ఏరియా వరకూ చేపడుతున్న ఆ రహదారి పనులను సమ్మిట్ నాటికి పూర్తి చేయాలని అన్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడవద్దని అన్నారు. అన్ని పమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని వివరించారు. సంబంధిత విభాగ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సమయానికి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు సేవా గుణం తప్పనిసరి'

పెందుర్తి రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సేవాగుణాన్ని అలవరుచుకోవాలని టీడీపీ నాయకుడు అయితి ఎర్నిబాబు అన్నారు. గోపాలపట్నం ఆదిత్య పీజీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం చీమలాపల్లిలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్‌తో సేవా భావం ఏర్పడుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీమోహన్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.


చీమలాపల్లిలో మొక్క నాటుతున్న విద్యార్థులు

విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి

పెందుర్తి: విద్యార్థులు సమాజానికి సేవ చేసే విధంగా ఎదగాలని శ్రావణి ఫిషింగ్ కంపెనీ ఎండీ జి.సాంబశివరావు అన్నారు. పురుషోత్తపురంలో ఉన్న బాలాజీ హైఫీల్డ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన 14వ వార్షికోత్సవాన్ని సాంబశివరావు, కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు పాఠశాల చైర్మన్ మండవ రవికుమార్ సంయుక్తంగా ప్రాంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

గుంతలమయంగా సర్వీస్ రోడ్డు

వేపగుంట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాలయం పక్కను ఉన్న పెట్రోల్ బంకు నుంచి వేపగుంట ట్రాఫిక్ జంక్షన్ కూడలి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పెందుర్తి వెళ్లే బస్‌స్టాప్ వెనుక నుంచి వాటర్‌ట్యాంకు మలుపు వరకు ప్రయాణమంటే నరకమేనని పలువురు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేబుల్స్ కోసం, ఇతర కారణాల వల్ల రోడ్డును తవ్వి సక్రమంగా పూడ్చకపోవడం వల్ల రహదారిపైన రాళ్లు తేలాయి. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని గుంతలను పూడ్చినప్పటికీ పూర్తి స్థాయిలో పనులు జరగకపోవడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరారు.


వేపగుంట జంక్షన్‌లో పెందుర్తి వెళ్లే బస్టాప్ వద్ద ఏర్పడ్డ గుంతలు

టిడ్కో గృహాలకు మౌలిక వసతుల కల్పన

పెదగంట్యాడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ దయాళ్‌నగర్ సమీపంలో నిర్మించిన టిడ్కో గృహసముదాయానికి మౌలిక వసతుల కల్పన పనులు కొనసాగుతున్నాయి. సంక్రాంతికి ఈ టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందజేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పనులను చురుగ్గా కొనసాగిస్తోంది. ఈ సందర్భంగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు వంటి పనులు జరగుతున్నాయి. అయితే అనేక ఇళ్లకు వైరింగ్, ప్లంబింగ్, ఫ్లోరింగ్, కిటికీల వంటి పనులు పెండింగ్ ఉన్నాయని, వాటిని కూడా సత్వరమే పూర్తి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నేడు విమాన్‌నగర్ కమ్యునిటీహాలు ప్రారంభం

ఎన్ఏడీ జంక్షన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో కమ్యునిటీ హాలుపై నిర్మిస్తున్న అదనపు అంతస్తును ఎమ్మెల్యే గణబాబు ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని కార్పొరేటర్ బొమ్మిడి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదనపు అంతస్తు నిర్మాణానికి జీవీఎంసీ రూ. 41.5 లక్షలు ఖర్చు చేసిందని తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు

కూర్మన్నపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10న విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-17 బాలురు, బాలికల హ్యాండ్‌బాల్, నెట్‌బాల్ పోటీలకు కణితి జడ్పీ హైస్కూల్ నుంచి ఎంపికైన కె.దేవి. సీహెచ్. సంజిత, వైయశ్వంత్‌లను హెచ్ఎం నరసింగరావు, పీఈటీ నారాయణరావు శనివారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 69 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలుగా నిలిచి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రయాణికుల మన్ననలు పొందిన ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్

కూర్మన్నపాలెం,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్‌లో శనివారం ఉదయం 11 గంటలకు కొయంబత్తూర్-ధన్‌బాద్ స్పెషల్ ట్రైన్ ఆగింది. ఓ కుటుంబం ప్లాట్‌ఫాం మీదకు వచ్చే సరికి ట్రైన్ కదిలింది. ట్రైన్ కదులుతోందన్న గాబరాలో ఆ కుటుంబం ట్రైన్ ఎక్కేసింది. ఆ తొందరలో లగేజీ బ్యాగును ప్లాట్‌ఫాంపైనే మరచిపోయారు. విధుల్లో ఉండి ఇదంతా గమనిస్తున్న ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమణ ఆ లగేజీని పక్క బోగీలో ఉన్న ప్రయాణికులకు అప్పగించి, వారికి ఇవ్వమని సూచించారు. బ్యాగును అందించిన ఇన్‌స్పెక్టర్ రమణ ప్రయాణికుల మన్ననలు పొందారు.

వైభవంగా దానప్ప తల్లి ముర్రాట ఉత్సవాలు

- 1116 రకాల పిండి వంటలతో సారె ఊరేగింపు

కూర్మన్నపాలెం,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు దుగ్గపువానిపాలెం ఆరాధ్య దైవం దానప్ప తల్లి ఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కనుల పండుగగా జరిగాయి. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సహస్ర కలశాలతో, 1116 రకాల పిండి వంటలతో అమ్మవారి సారె ఊరేగించారు. మధ్యాహ్నం సుమారు 20 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, తిప్పల దేవన్ రెడ్డి, అమ్మవారికి పూజలు చేశారు.

ఢిల్లీలో హ్యాబిటెట్ సెంటర్ పనితీరు పరిశీలన

- వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

సిరిపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీల్లో పేరొందిన ఇండియా హ్యాబిటెట్ సెంటర్‌ను వీఎంఆర్‌డీ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, అదనపు కమిషనర్ రమేశ్ శనివారం సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ గృహ, పట్టణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులు జరుగుతున్న 18వ 'అర్బన్ మొబిలిటీ ఇండియా కాన్ఫరెన్స్ అండ్ ఎక్స్-2025' సదస్సులో పాల్గొనేందుకు వెళ్లి పలు అంశాలపై సమీక్షిస్తున్నారు. విశాఖపట్నంలో వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో పీపీపీ విధానంలో ఈస్ట్‌కోస్ట్ హ్యాబిటెట్ సెంటర్‌ను నిర్మించనున్న నేపథ్యంలో ఢిల్లీలో సెంటర్‌ను పరిశీలించారు. హ్యాబిటెట్ సెంటర్ నిర్మాణ శైలి, కన్వెన్షన్ సెంటర్లు, మీటింగ్ హాల్స్, కార్యాలయాల నిర్మాణం ఏ తీరుగా ఉన్నాయనేది పరిశీలించారు. దీని నిర్మాణం, నిర్వహణ వంటి అంశాలపై సెంటర్ జీఎం అమర్నాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. విశాఖ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపుతున్న చొరవ, ఇక్కడ రూపుదిద్దుకుంటున్న ప్రాజెక్టులు, ఈ నేపథ్యంలో నిర్మించతలపెట్టిన హ్యాబిటెట్ సెంటర్ ఆవశ్యకతను వారు వివరించారు. జాతీయ సదస్సు ఆదివారంతో ముగియనుండగా, వీఎంఆర్‌డీఏకు సంబంధించిన ఇతర అంశాలపై చర్చించనున్నట్లు వారు వెల్లడించారు.


ఢిల్లీలోని హ్యాబిటెట్ సెంటర్ వద్ద వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఏసీ రమేశ్

'ఏఐ బేస్డ్ ఇమేజ్ ప్రొసెసింగ్' పై అవగాహన

అగనంపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో 'ఏఐ బేస్డ్ ఇమేజ్ ప్రొసెసింగ్' అనే అంశంపై శనివారం గెస్ట్ లెక్చర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకటరావు మాట్లాడుతూ ఏఐ ఆధారిత ఇమేజ్ ప్రొసెసింగ్ సాంకేతికతలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం పరిశ్రమలు, వైద్య రంగం, భద్రతా వ్యవస్థలు, వ్యవసాయం వంటి అనేర రంగాల్లో ఏఐ బేస్డ్ ఇమేజ్ ప్రొసెసింగ్ విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచిందన్నారు. ఏఐబేస్డ్ ఇమేజ్ ప్రొసెసింగ్ భవిష్యత్తు డిజిటల్ ప్రపంచానికి ఆధారమన్నారు.

'కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలి'

మల్కాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఎరువుల కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు అన్ని విధాల న్యాయం జరిగే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. మల్కాపురం గ్రామ మండలిలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2026 ఫిబ్రవరి నుంచి నూతన వేతన సవరణ చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సంవత్సరానికి ఒకసారి యూనిఫామ్, కార్మికులకు ప్రమోషన్ ఇవ్వాలని కోరారు.


చెక్కును అందజేస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సీఎం సహాయనిధి పేదలకు వరం

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు

పెందుర్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సుజాతనగర్‌లో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏడుగురికి రూ.3.55 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను అందిస్తున్నామన్నారు. సీఎం సహాయనిధిని లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

జిమ్ ప్రారంభం

చినముషిడివాడలో ఆర్ఈవీ ఫిట్‌నెస్ జిమ్‌ను ఎమ్మెల్యే పంచకర్ల శనివారం ప్రారంభించారు. అనంతరం అక్కడున్న వ్యాయామ పరికరాలను వీక్షించి కాసేపు కసరత్తు చేశారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే సత్కారం


గణప్రియను సత్కరిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని, జాతీయ ఐక్యత కోసం పార్లమెంట్‌లో ప్రసంగించిన పెందుర్తి మండలం రాంపురానికి చెందని ఇంజనీరింగ్ విద్యార్థి ఎం.గణప్రియను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలను అవర్చుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు.

యువతకు ఉపాధి కల్పించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపాలెం కాలనీలోని శ్మశానవాటికకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో ఎస్సీ షాపింగ్ కాంప్లెక్సు నిర్మించి యువతకు ఉపాధి కల్పించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు కాలనీ వాసులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాలనీలోని అనేక మందికి సొంతిళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి ప్రభుత్వం గృహ సముదాయం కల్పించాలని కోరారు. ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న మంగళవారం సంతను వేరొక చోటుకు మార్చి దానిని రైతు బజారుగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ నాయకులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ నిర్వాసితుల సమస్యలపై వినతి

అగనంపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ నిర్వాసితుల సమస్యలపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు 85 వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డులో ప్రధాన సమస్యలను వివరించారు. ముఖ్యంగా శశ్మానవాటికకు స్థలం కేటాయించాలని కోరారు. 2010 నాటికి 18 సంవత్సరాలు నిండిన మేజర్స్ సన్స్‌కు ఇళ్ల పట్టాల అందజేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధి పనుల పరిశీలన

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 68 వార్డు అక్కిరెడ్డిపాలెంలో సుమారు రూ.80 లక్షలతో నిర్వహిస్తున్న నక్కల చెరువు అభివృద్ధి పనులను కార్పొరేటర్ గుడివాడ అనూష శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వాకింగ్ ట్రాక్, ఆధునీక విద్యుత్ దీపాల పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

'ఉక్కు'లో భద్రతకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి

- గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి కేఎస్ఎన్.రావు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో భద్రతకు మరింత పటిష్ఠ చర్యలు చేపట్టాలని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకరరెడ్డికి గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి కేఎస్ఎన్.రావు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌లో భద్రత లోపించడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటి నివారణకు తగు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. పని ప్రదేశంలో భద్రతక సంబంధించి ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఉక్కు కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించి భద్రత పరమైన అంశాలపై చర్చించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు ఉన్నారు.

స్టీల్ ప్లాంటులో మహిళా ఉద్యోగుల పాత్ర కీలకం

- జనరల్ మేనేజర్ మధుసూదనరావు


సదస్సుకు హాజరైన వర్కింగ్ ఉమెన్స్ బృందం

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగుల నైపుణ్యాలు ప్లాంట్ ప్రగతికి దోహపడతాయని స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ ఎం.మధుసూదనరావు అన్నారు. లోక్‌నాయక్ బిర్సాముండా 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ ఆదేశాలతో ఉక్కు యాజమాన్యం సహకారంతో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'వర్కింగ్ ఉమేన్స్‌కు ఉమెన్స్ అండ్ హెల్త్ కేర్ అనే అంశంపై ట్రైనింగ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. ప్రతి ఉద్యోగి ప్లాంట్ ప్రగతి కోసం విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. అందులో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేసేవరకూ పోరాటాలు

ఇంటక్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ అధ్యక్షుడు కె.వంశీకృష్ణ

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు న్యాయం చేసే వరకూ పోరాటాలు సాగుతాయని, వీటిని మరింత ఉధృతం చేస్తామని ఉక్కు నిర్వాసిత నాయకుడు, ఇంటక్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ అధ్యక్షుడు కె.వంశీకృష్ణ పేర్కొన్నారు. విశాఖలో పెట్టుబడుల సదస్సు నిర్వహించడం మంచి విషయమేనని, ఈ క్రమంలో ఉక్కు నిర్వాసితులు, ప్లాంట్‌లో ఉద్యోగాలు కోల్పోయిన కాంట్రాక్టు కార్మికుల విషయంపై రాష్ట్ర ప్రభుత్వ స్పందించాలన్నారు. కార్మికులను తొలగించి ఆరు నెలలు గడుస్తున్నా నేటి వరకూ ఎవరూ స్పందించలేదని అన్నారు. ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చి నిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

నగరానికి నగిషీలు!

- ఆకట్టుకునే ఆకృతుల్లో మొక్కల కుండీలు
- అదిరిపోయే వాటర్‌ఫౌంటెన్‌లు
- ఆకర్షణీయ 'భాగస్వామ్యం' అదరహో!





వీఎంఆర్‌డీఏ కార్యాలయం వద్ద...



డివైడర్ మధ్య అందమైన పూలమొక్కలు

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో సుందర దృశ్యం ఆవిష్కృతమవుతోంది. పగలు పచ్చదనంతో కనువిందు చేస్తుంటే, చీకటి పడగానే విద్యుత్ సొబగులు, ఫౌంటెన్లు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే పారిశ్రామిక పెట్టుబడిదారుల సదస్సు (సీఐఐ) కోసం జీవీఎంసీ రూ.40 కోట్లు వెచ్చించి చేపడుతున్న సుందరీకరణ పనులతో నగరం కొత్తదనం సంతరించుకుంది. సదస్సుకు దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులు అబ్బురపడేలా బీచ్‌రోడ్డు పొడుగునా అందమైన కళాకృతులు ఏర్పాటు చేస్తున్నారు. సీతకొండ వ్యూ పాయింట్ వద్ద కొండవైపు తాబేలు, నత్తలను పోలిన పూలకుండీలను ఏర్పాటు చేసి, చూడగానే నిజమైన జంతువులేనా? అనిపించేలా వాటి సహజరంగులను అద్దారు. దీంతో అటుగా వెళుతున్నవారికి నిజమైన నత్త, తాబేలు మొక్కల్లో నుంచి రోడ్డువైపు నడిచివస్తున్నాయనే భావన కలుగుతోంది. కోస్టల్‌బ్యాటరీ నుంచి భీమిలి వరకు బీచ్‌రోడ్డు పొడుగునా అందమైన మొక్కలు, కూడళ్ల వద్ద రాత్రిపూటచూస్తే అదిరిపోయే వాటర్‌ఫౌంటెన్‌లు, గోడలకు అందమైన, సృజనాత్మకతతో కూడిన బొమ్మలు, చిత్రాలను వేయడంతో బీచ్‌రోడ్డు కొత్తకళ సంతరించుకుంది. మరోపక్క రైల్వేస్టేషన్-తాటిచెట్లపాలెం మధ్య ఆకర్షణీయమైన మొక్కలతో హరిత సోయగం బాటసారులను చూపు తిప్పుకోనివ్వడం లేదు. సాయంత్రం కాగానే పార్క్ హోటల్, వీఎంఆర్డీఏ కార్యాలయం, ద్రోణంరాజు సర్కిల్, సంపత్ వినాయగర్ ఆలయం వద్ద విద్యుత్ సొబగులతో వాటర్ ఫౌంటెన్లు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఫ్లైఓవర్‌కు జాతీయ జెండా రంగులతో విద్యుత్ వెలుగులు జిగేల్‌మనిపిస్తున్నాయి. మొత్తానికి భాగస్వామ్య సదస్సు పుణ్యమా! అని నగిషీలు చెక్కడంతో నగరం కొత్తరూపు సంతరించుకుంది.



సీతకొండ వద్ద నత్త ఆకారంలో మొక్కల కుండీ



తాటిచెట్లపాలెం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో కనువిందు చేస్తున్న మొక్కలు



అటవీ శాఖ కార్యాలయం వద్ద గోడలపై జంతువుల పెయింటింగ్



పార్క్ హోటల్ సమీపంలోని ఫౌంటెన్ల వద్ద విద్యుత్ వెలుగులు

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య



పితాన స్వాతి (ఫైల్ ఫొటో)

సబ్బవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధి సాయినగర్ కాలనీలో వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి సీఐ జి.రామచంద్రరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. అచ్యుతాపురం మండలం నునపర్తి గ్రామానికి చెందిన పితాన చిరంజీవికి, భీమిలికి చెందిన స్వాతి (29)కి పుష్కర కాలం క్రితం వివాహం జరిగింది. అనంతరం భార్యాభర్తలు సబ్బవరం వచ్చి సాయినగర్ కాలనీలో స్థిరపడ్డారు. చిరంజీవి విశాఖ నగరంలోని మధురవాడలో ఒక గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా, స్వాతి సబ్బవరంలోనే బ్యూటీషియన్‌గా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే కొంతకాలం నుంచి భార్యాభర్తల మధ్య సఖ్యత లేదు. చిరంజీవి ఎక్కువ రోజులు మధురవాడలోనే వుంటూ అప్పుడప్పుడు సబ్బవరం వచ్చి వెళుతున్నాడు. స్వాతి తల్లి ఎర్ర వెంకయ్యమ్మ సబ్బవరంలో కుమార్తె వద్దనే వుంటూ, మనవళ్ల బాగోగులు చూసుకుంటున్నది. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అల్లుడితో సఖ్యత ఉండమని ఆమె తరచూ చెబుతుండేది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి స్వాతి ఒక గదిలో నిద్రించగా, మనవళ్లతో వెంకయ్యమ్మ మరో గదిలో నిద్రించారు. వెంకయ్యమ్మ శనివారం ఉదయం నిద్ర లేచిన తరువాత స్వాతి పడుకున్న గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. వెంటనే స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ జి.రామచంద్రరావు సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి తరలించారు. స్వాతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

ఎంవీపీ కాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్దిలపాలెం కూడలిలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. మృతుడు అల్లిపురం పిల్లవారి వీధికి చెందిన సాహంకరి జోగేశ్వర్ (24) తన స్కూటీపై మద్దిలపాలెం వైపు వెళ్తుండగా, వెనుక వస్తున్న సీజీ 04 ఎన్‌ఆర్ హెచ్‌డి 7820 నెంబరు గల లారీ వేగంగా వచ్చి ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఎస్‌ఐ అప్పలరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రీన్‌పార్క్ హోటల్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



సిల్క్ చీరను చూపుతున్న నిర్వాహకులు

మహారాణిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వివాహాది శుభకార్యక్రమాలకు భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలా అనేక రకాల పట్టు, నేత చీరలతో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ కమ్ సేల్ నగరానికి వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 7న ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్ 11వ తేదీ వరకు హోటల్ గ్రీన్‌పార్కులో కొనసాగుతుంది. వివిధ రాష్ట్రాల నుంచి సేకరించిన మగ్గాల ఉత్పత్తులు అందుబాటులో ఉంచారు. అనేక రకాల పట్టు, కాటన్ డిజైన్ దుస్తులు, డిజైనర్ చీరలు, బ్లౌజ్‌లు, కుర్తీలు అందుబాటులో ఉంచారు. పైదానీ సిల్క్, బెంగళూర్ సిల్క్, సాఫ్ సిల్క్, కాషిడా సిల్క్ చీరలు, చందేరి, మహేశ్వరి చీరలు, తుస్సా మట్కా బాగల్పూరు సిల్క్ చీరలు, కాంచీపురం, తాబీ సిల్క్, బెనారస్ సిల్క్ చీరలు ప్రదర్శనలో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11 నుంచి రాత్రి 9 వరకు ఉచిత ప్రవేశంతో ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

గృహిణి ఆత్మహత్య

గోపాలపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసగా మారిన భర్తలో మార్పురాకపోవడంతో మనస్తాపానికి గురై ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానిక లక్ష్మీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌కు చెందిన టి.రమ(28) గోపాలపట్నంలోని ఓ దుకాణంలో పనిచేస్తూ భర్త, ఇద్దరు పిల్లలతో నివసిస్తోంది. రమ భర్త మద్యానికి బానిసై కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసేవాడు. తన భర్తకు ఎంతగా నచ్చజెప్పినా అతనిలో మార్పురాకపోవడంతో శనివారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ హుక్‌కు ఉరేసుకుని రమ ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి బంగారమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు పరిశీలించారు.

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి దేవస్థానం

సింహాచలం, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 0891-2764949

Website : www.simhachalamdevasthanam.net.

E-mail:endow-eosvlnsd@gov.in, jc_co_simhachalam@yahoo.co.in

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు ప్రకటన

ఆర్.సి.నెం.ఇ1/486/2024, తే.08.11.2025

శ్రీ స్వామి వారి దేవస్థానం నందు కొండ పైన అభివృద్ధి పనులు సివిల్ వర్క్స్ (2 Nos.) ఇ-టెండర్ ద్వారా కోరడమైనది.

పై పనులకు www.apeprocurement.gov.in & https://tender.apeprocurement.gov.in ద్వారా టెండర్లు పిలువడమైనది. Website : www.simhachalamdevasthanam.net

Contact No.+91 9618072527, + 91 8519807173, + 91 9177444441, +917659990664

సం/- ఎన్.సుజాత
కార్యనిర్వహణాధికారి

రేడియాలజీ సేవలకు డిమాండ్



ప్రసంగిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ వాణి

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రేడియాలజీ వైద్య సేవలకు డిమాండ్, ఒత్తిడి ఎక్కువగా ఉంటోందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆ విభాగం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వాణి మాట్లాడుతూ కేజీహెచ్‌లో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. ఏపీ రేడియాలజిస్టుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ప్రజల్లో రేడియాలజీపై అవగాహన తీసుకురావలసి ఉందన్నారు. విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు మాట్లాడుతూ అనేక వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో రేడియాలజీది కీలకపాత్ర అన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ ఫ్యాకల్టీ, రేడియోగ్రాఫర్లు, పీజీ, ఇమేజింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కేక్ మిక్సింగ్




కేక్ మిక్సింగ్ చేస్తున్న దృశ్యం

రామ్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో ముందస్తుగా కేక్ మిక్సింగ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రానున్న క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలకు ఆహ్వానం పలుకుతూ సాగరతీరంలోని పార్కు హోటల్‌లో కేక్ మిక్సింగ్ కార్యక్రమాన్ని శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. బాదం, జీడిపప్పు, పిస్తా వంటి డ్రైఫ్రూట్స్‌తో పాటు సుగంధ ద్రవ్యాలు, స్పిరిట్ కలగలిపి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆనంతం పరస్పర ఐక్యతకు ప్రతీకగా సంప్రదాయ కేక్ మిక్సింగ్ వేడుకలు నిర్వహించారు.

గంజాయి స్వాధీనం... ముగ్గురి అరెస్టు

గాజువాక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి జోగవానిపాలెంలో అక్రమంగా గంజాయి ఉన్న ముగ్గురిని గాజువాక పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గాజువాక ప్రాంతానికి చెందిన యేర్రబిల్లి భద్రరాజు (63), మల్కాపురంవాసి కర్రి సంతోష్‌కుమార్ (33), గాజువాక ఆటోనగర్ ప్రాంతానికి చెందిన గాడే గోపి (30)లు జోగవానిపాలెంలో అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించారు. వీరి వద్ద మూడు కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ ఎ.పార్థసారథి తెలిపారు.

ప్రమాదకరంగా యారాడ తీరం





పర్యాటకులను ఆకర్షించే యారాడ వద్ద సముద్రం

మల్కాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): యారాడకు వెళ్తున్నారా..? తస్మాత్ జాగ్రత్త.. ఇక్కడ సముద్రం అనేక మందిని మింగేసింది.. ఆదివారం వచ్చిందంటే చాలు.. ఏ దుర్వార్త వినాల్సి వస్తుందోనని పర్యాటకులు భయపడుతున్నారు. ఈ ఏడాదిలో యారాడ సముద్ర స్నానానికి వెళ్లిన కొందరి జాడ నేటికీ తెలియలేదు. ఇక్కడ సముద్రంలో గల్లంతు అయితే తిరిగి ఒడ్డుకు రావడం చాలా కష్టం.. ఇటీవల గల్లంతైన ఇద్దరు యువకుల ఆచూకీ ఇప్పటి వరకు తెలియలేదు. 2022 నుంచి 2025 వరకు దాదాపు 11 మంది గల్లంతు కాగా, కేవలం ఒక్కరి ఆచూకీ తెలిసింది. కొండల మధ్య యారాడ బీచ్ ఉండడం, తీరంలో అలలు ఉవ్వెత్తున వస్తూ .అదే తీరులో లోపలకు వెళ్తుంటాయి. ఇలాంటి సమయంలో అక్కడ ఎవరైనా సముద్ర సాన్నం చేస్తే.. అంతే సంగతులు!. అక్కడ సముద్ర తీరం పెద్ద గొయ్యిలా ఉండడంతో ప్రమాదాలు ఎక్కువ జరగడానికి ఆస్కారం ఉంటోంది. అలాగే గంగవరం పోర్టు నిర్మాణంలో భాగంగా సముద్రాన్ని తవ్వడంతో పాటు, నీటి ప్రవాహానికి అడ్డుకట్టవేసేందుకు ఒడ్డున పెద్దఎత్తున రాళ్లు వేశారు. కొన్ని రాళ్లు సహజసిద్ధంగానే సముద్రం ఒడ్డున ఉన్నాయి. వీటి కారణంగా అక్కడ పరిస్థితి భయంకరంగా మారింది. రాళ్లు వేయడం కూడా ప్రమాదాలకు కారణమని యారాడ వాసులు చెబుతుంటారు. 2022 నుంచి ఇప్పటి వరకు దాదాపు 210 మందిని లైఫ్ గార్డులు రక్షించారని స్థానికులు చెప్పారు. సముద్ర అధయయన కర్తలు యారాడ బీచ్‌లో జరుగుతున్న ప్రమాదాల నివారణకు తగిన సూచనలు ఇవ్వాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.









CLASSIFIEDS

OLD AGE HOME

» శ్రీవైష్ణవి రిటైర్మెంట్ హోమ్స్ హాస్పటల్, ఓల్డ్ ఏజ్ హోమ్స్, హోమ్ నర్సింగ్ సర్వీసెస్, బెడ్‌రిడ్, ఫిజియోథెరపీ, A/C, Non A/C రూమ్స్ @ MVP / సీతమ్మధార, / విశాలాక్షినగర్ / పి.ఎం.పాలెం. నర్సింహారెడ్డి : 9676000633 . AJV_ 251759

TO-LET

» నర్సీపట్నం క్రిష్ణాబజార్ మెయిన్ రోడ్డులో 1600Sft షాపు అద్దెకు కలదు. సంప్రదించగలరు : 98494 57575, 87903 02929. AJV_251768

» 740 Sft Avaiable with Strong Room, FOR Banks / Private Finance. Near. NAD Junction. Visakhapatnam. Ph: 890411 4551. AJV_251770

WANTED

★ హైదరాబాదులో పని చేయుటకు DEO'S సూపర్‌వైజర్స్, పిక్కర్స్, ప్యాకర్స్, హెల్పర్స్, సెక్యూరిటీ గార్డ్స్ M/F అర్జెంటుగా కావలెను. సంప్ర: యాదవ్ కన్సల్టెన్సీ. 7337391849 / 7337391853 AJH-003483

» Need Teaching Staff for ITI Electrician / Fitter Trades, Anakapalli / Atchuthapuram. Salary 15K. Contact : 7032015042 AJV_14598

FOR LEASE

» మంచి రన్నింగ్ లో ఉన్న ప్రముఖ లాడ్జ్ లీజుకు కలదు, రైల్వేస్టేషన్ దగ్గర, ఛూపేష్‌నగర్, బౌడారారోడ్డు,విశాఖపట్నం. సంప్రదించగలరు :7075300517 AJV_251767

HOUSE FOR SALE

» వేపగుంట, లక్ష్మీపురం పోర్ట్ కోలనీలో 167 చ॥గ॥ 3BHK G+1 ఇండిపెండెంట్ హౌస్, రెడీ టు ఆక్యుపై & పెందుర్తి ప్రశాంతి నగర్‌లో 1390 Sft + 3BHK రెడీ టు ఆక్యుపై. అమ్మకం సంప్ర : 7997039345, 9885708968 AJV_251771

RENT / LEASE / SALE

GF 1500 Sft Commercial Space for Office @ Satya Appartments, Opp Varun Bajaj, Dondaparthi Jn., 9949923818

FLAT FOR SALE

★ Dwarakanagar - 2 BHK Premium Flats, N Facing, No GST, Ready to occupy, Near B.V.K. College, Dwarakanagar, VSP. Ph: 9542794669, 9492458777 AJV_251758

» చోడవరం జంక్షన్ కోఆపరేటివ్ కోలనీలో 2BHK 1156Sft, E/F, 5th ఫ్లోర్ అమ్మకానికి కలదు. @23 లక్షల రూపాయలు మాత్రమే. సంప్రదించగలరు : 9885215580. AJV_251772

FLAT FOR SALE

» 2BHK Flat, E/F 1095sft with Car Parking & Amenities, Ready to occupy. Shruthi Grand Apt, 2nd Floor, Gayatri Nagar, Madhurawada. Ph: 9440072934, 8919846107. AJV_264102

» 3 BHK flat 1420 sqft + 120 sqft two car parkings, full wood work modular kitchen safety grills etc for URGENT sale just behind SHEELA NAGAR Call : 8125588588. AJV_251766

★ East Facing 1000sft 2BHK Near By Park, Tempany School, Main Road, Side Flats, VUDA Colony, Ready to Occupy. Gajuwaka. Ph: 9603626627. AJV_251763

LAND FOR SALE

» ఎస్.కోట నుండి అరకు హైవేరోడ్ చిలకలగెడ్డ చెక్‌పోస్ట్ దగ్గర 2.18 ఎకరముల స్థలం (రిసార్ట్స్‌కు అనుకూలం) సంప్ర: 9542794669 9441340883. AJV_251757

LAND FOR SALE

★ 2 Acres Mango Garden with complete fence, borewell, 22/44 feet permanent shed for dairy 900 teak-wood plants, 30 mango tree @ 1.60 lakh per cent &70 cents mango garden @1lakh per cent in kirla vil nr alamanda & 600 sq yard commercial space on the main road k valsa @35k per sq yard for sale. Ph: 98483 72035. AJV_ 251773

PLOT FOR SALE

★ Commercial land 3 plot of 650 yards each or total 1950 yards for sale @ Plot Pedagantyada, Gajuwaka near BC Road, Visakhapatnam. Ph : 98480 29577. AJV_251769

» అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో పంచాయతి లేఅవుట్‌లో 457 చ॥గ॥ల స్థలం అమ్మకమునకు కలదు. సంప్రదించండి : 90322 40503, 80747 29815. AJV_251774

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact : 9963231176, 9966165093

భార్యతో ఘర్షణపడి బలవన్మరణం

కూర్మన్నపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి భార్యతో ఘర్షణకు దిగి అనంతరం తన ఇంటిలోనే ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.. బతుకు తెరువు కోసం రెండు నెలల క్రితం శ్రీకాకుళం నుంచి విశాఖకు విచ్చేసి, అగనంపూడి ఫార్మాసిటీ కాలనీ దరి దొప్పవానిపాలెం ఫేజ్-3లో ఓ అద్దె ఇంట్లో జె.సురేష్ రావు (31), సుధారాణిలు జీవనం సాగిస్తున్నారు. స్థానికంగా ఓ ప్రైవేట్ కంపెనీలో వెల్డింగ్ పనులు చేస్తున్న సురేష్‌బాబు మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడేవాడు. శుక్రవారం పనికి వెళ్తానన్న సురేష్‌రావు మద్యం తాగి ఇంటికి వచ్చాడు. 3వ నెల గర్భవతి అయిన సుధారాణి అప్పుడే ఆసుపత్రికి వెళ్లి వచ్చి, పనికి వెళ్లలేదా? అని భర్తను ప్రశ్నించి మందలించటంతో ఇరువురూ ఘర్షణ పడ్డారు. సుధారాణి చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను నేలకు కొట్టాడు. రాత్రి భోజనాలు చేశాక భర్త తన రూములోకి రమ్మని సుధారాణిని పిలిచాడు. ఆమె నిరాకరించి హాలు లో పడుకొంది. సురేష్ మద్యం మత్తులో ఉంటూ భార్య రాలేదని, మనస్తాపానికి గురై ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందాడు. శనివారం ఉదయం నిద్ర లేచిన సుధారాణి తలుపు కొట్టినా సురేష్ తీయకపోవటంతో సమీపంలో ఉన్న మరిది నరేష్‌కు ఫోన్ చేసి విషయం చెప్పింది. హుటాహుటిన నరేష్ తన అన్న సురేష్‌రావు ఇంటికి వచ్చి తలుపు కొట్టినా ప్రయోజనం లేకపోవటంతో కిటికీలోనుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. తక్షణమే వారు 112కు ఫోన్ చేసి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకొన్న దువ్వాడ పోలీసులు మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. సుధారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో ఎలుగుబంటి మృతి



స్లాత్ బేర్

ఆరిలోవ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో 12 సంవత్సరాల స్లాత్‌బేర్ (ఎలుగుబంటి) శనివారం ఉదయం మృతి చెందినట్లు క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. నాలుగు రోజుల నుంచి అనారోగ్యంతో ఉందని చెప్పారు. యోని భాగం నుంచి స్రవాలు కనిపించడంతో గర్భాశయానికి సంబంధించిన వ్యాధి లక్షణాలుగా వైద్యులు గుర్తించారు. వైద్యసేవలు అందించినప్పటికీ ఫలితంలేక ఎలుగుబంటి మృతి చెందిందని తెలిపారు.

సైబర్ నేరగాళ్లకు నకిలీ సిమ్‌లు అందిస్తున్న ఐదుగురి అరెస్టు

ఎండాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కస్టమర్లకు తెలియకుండా వారి ఐడీలతో నకిలీ సిమ్‌కార్డులు యాక్టివేట్ చేసి, సోషల్ మీడియాలో అకౌంట్లు తెరిచి డిజిటల్ అరెస్టు వంటి తీవ్ర నేరాలకు పాల్పడుతూ, సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న కృష్ణా జిల్లాకు చెందిన ఐదుగురిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. పులి నాగతారకేశ్వరరావు, పడమట శివకృష్ణ, బల్ల నాగరాజు, యర్రా నాగ వెంకటసాయి పవన్ చందూ, షేక్ అబ్దుల్ కరీమ్‌లను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. ఈ కేసులో ప్రధాన నిందితుల కోసం దర్యాప్తు ముమ్మరం చేశారు. వివరాల్లోనికి వెళితే.. విశాఖలోని గాజువాక ప్రాంతానికి చెందిన యడ్ల లక్ష్మణ్ (59) బీహెచ్‌ఈఎల్ ఉద్యోగి. గత ఏడాది ఆగస్టులో మొబైల్ నెంబర్ నుంచి బెంగళూరులో పోలీసు అధికారినంటూ ఫోన్ చేశాడు. నకిలీ సిమ్ కార్డు తీసుకుని దుర్వినియోగం చేస్తున్నందుకు మీపై కేసు నమోదైందని భయపెట్టి సుప్రీంకోర్టు వారెంట్ జారీ చేసిందని బెదిరించాడు. వెంటనే రూ.15 లక్షలు ఇస్తే కేసు లేకుండా చూస్తామని చెప్పడంతో ఆ ఉద్యోగి పీఎఫ్ రుణం తీసుకుని రూ.10 లక్షలు ఆర్టీజీఎస్ ద్వారా పంపారు. మరో రూ.4 లక్షలు అప్పు చేసి ఇచ్చారు. అంతటితో సరిపుచ్చుకోకుండా మరింత డబ్బు పంపాలని వేధించడంతో బాధిత ఉద్యోగి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు అరెస్టయిన నిందితులు సెల్ పాయింట్లు, సిమ్ డిస్ట్రిబ్యూటర్ల నుంచి నకిలీ సిమ్ పొంది సైబర్ నేరగాళ్లకి అందిస్తున్నట్లు గుర్తించారు.